teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...

తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 224 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 14 డిసెంబర్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.


## లోక్‌సభలో తొలిసారిగా ప్రసంగించిన ప్రియాంక గాంధీ

75 ఏళ్లు పూర్తయిన రాజ్యాంగంపై ప్రత్యేక చర్చ



న్యూ ఢిల్లీ, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ నాయకురాలు, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా శుక్రవారం లోక్‌సభలో తొలిసారిగా ప్రసంగించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం లోక్‌సభలో ప్రత్యేక చర్చ పెట్టారు. ఈ చర్చలో భాగంగా ప్రియాంక ప్రసంగించారు. కాగా, ప్రియాంక గాంధీ ఇటీవల జరిగిన వయనాడ్ ఉప

మిగతా 2 లో



## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధింపు

14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు

హైకోర్టు అనూహ్య నిర్ణయం.. మధ్యంతర బెయిల్ మంజూరు

.. వివరాలు 2లో



## రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు

అవమానించేలా తెలంగాణ తల్లి విగ్రహమంటూ ఆరోపణలు

.. వివరాలు 2లో





# ముఖ్యమంత్రి సంక్షేమ బాట

సంక్షేమ హాస్టళ్లలో ముఖ్యమంత్రి, మంత్రుల తనిఖీలు

సీనియర్ ఐఏఎస్‌లు, ప్రజా ప్రతినిధులది నేడు హాస్టళ్ల బాటే

హాస్టళ్ల పరిస్థితులపై అంచనా వేయనున్నట్లు సమాచారం



తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలో పరిస్థితులను స్వయంగా అంచనా వేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు (శనివారం) సంక్షేమ హాస్టళ్ల తనిఖీ చేపట్టనున్నారు. సీఎంతోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలతో సహా రాష్ట్ర మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు సీనియర్ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రజా ప్రతినిధులు గురుకుల, రెసిడెన్షియల్ హాస్టళ్లను

మిగతా 2 లో

కేటీఆర్‌ను విచారించేందుకు

# గవర్నర్ గ్రీన్ సిగ్నల్

విచారణను ప్రారంభించనున్న ఏసీబీ

ఫార్ములా ఈ రేసు కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ నుంచి అనుమతి రావడంతో ఏసీబీ ఇక విచారణను ప్రారంభించనుంది. మొదట కేటీఆర్‌కు నోటీసు ఇచ్చి విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేసింగ్‌లో భారీ స్కాం జరిగినట్లు రేవంత్ సర్కార్ గుర్తించింది.



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): నిబంధనలకు విరుద్ధంగా నిధుల చెల్లింపులు జరిగాయని విచారణలో బయటపడింది. రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేకుండానే విదేశీ కంపెనీతో ఒప్పందం, చెల్లింపులు జరిగినట్లు తేలింది. ఆర్థిక శాఖ అనుమతి లేకుండానే గత ప్రభుత్వం చెల్లింపులు

మిగతా 2 లో

## కండిషన్‌లు పెట్టి తప్పించుకునే ప్రభుత్వం కాదు

ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూ. ఇస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అనంతరం పొంగులేటి మీడియాతో మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వంలో కండిషన్‌లు పెట్టి ఇళ్లు ఇవ్వకుండా తప్పించుకునే ప్రభుత్వం కాదన్నారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్టర్లకు ఇళ్లు ఇస్తే

మిగతా 2 లో



## న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల నిబంధనలు

హొటళ్లు, రెస్టారెంట్లు, పబ్ నిర్వాహకులకు సూచనలు

హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): మరికొద్ది రోజుల్లో నూతన సంవత్సరం రానుంది. న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కోసం చాలా మంది ఇప్పటికే ప్లాన్ చేసుకుంటున్నారు. ఎక్కడికెళ్లాలి, ఏం చేయాలి అనే కార్యక్రమాలను ఫిక్స్ చేసుకుంటున్నారు. అదే విధంగా

మిగతా 2 లో



## కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో సీఎం రేవంత్ భేటీ

నిధుల మంజూరు, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చలు

న్యూ ఢిల్లీ, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో బిజీ బిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా రెండో రోజు (శుక్రవారం) ఆయన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మాలా సీతారామన్ తో భేటీ అయ్యారు. ఈ భేటీలో

మిగతా 2 లో



## కానిస్టేబుల్ నాగమణి హత్య కేసులో పోలీసు అధికారిపై వేటు

తెలంగాణ బ్యూరో, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కానిస్టేబుల్ కొంగర నాగమణి హత్య కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ పోలీస్ అధికారిపై రాచకొండ కమిషనర్

మిగతా 2 లో



## లగచర్ల రైతుకు బేడీలు వేసిన ఘటనపై స్పందించిన కేటీర్

చేసే పనులు చేస్తూ అధికారులను బలిపశువులు చేస్తున్నారు?

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీర్ ఫైర్

హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): లగచర్ల రైతుకు బేడీలు వేసిన ఘటనలో కంది సెంట్రల్ జైలు జైలర్

మిగతా 2 లో

## ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 2 రోజుల సెలవులు

రైతులు మార్కెట్‌కి ధాన్యాన్ని తీసుకొని రావద్దని సూచనలు



.. వివరాలు 2లో

## పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లకు ఆదేశాలు

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



.. వివరాలు 2లో



## ఫుడ్ కార్పొరేషన్ అధికారులపై మంత్రి సీతక్క ఫైర్

ఎఫ్‌సీఐపై మంత్రి సీతక్క రివ్యూ

కార్పొరేషన్ పని తీరుపై సీతక్క అసంతృప్తి వ్యక్తం

02

# ముఖ్యమంత్రి సంక్షేమ బాట

మొదటి పేజీ తరువాయి

శనివారం నాడు వ్యక్తిగతంగా సందర్శించి, అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేసి పరిస్థితులను అంచనా వేయనున్నారు. రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ గురుకుల హాస్టళ్లలోని దాదాపు 8 లక్షల మంది విద్యార్థులకు డైట్ చార్జీలు 40శాతం, కాస్మోటిక్ చార్జీలు 200శాతం పెంచుతూ ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు రాష్ట్రంలోని పాఠశాలలో 667.25 కోట్లతో మౌలిక సదుపాయాలను కూడా ప్రభుత్వం కల్పించింది. హాస్టల్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించేందుకు ఆకునూరి మురళి అధ్యక్షతన స్టేట్ ఎడ్యుకేషన్ కమిషన్ కూడా ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గం ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి కూడా శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ, మైనారిటీ హాస్టల్లో మరింత ప్రామాణికమైన ఆహారాన్ని అందించడంతోపాటు మెరుగైన విద్య బోధనా అవకాశాలను పెంపొందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆదేశాలతో శనివారం నాడు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మెంత్తం రాష్ట్రంలోని అన్ని గురుకుల సంక్షేమ హాస్టల్లో పర్యటించి పరిస్థితులను స్వయంగా సమీక్షించనుంది.

**ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన వివరాలు :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్ జిల్లాల లోని ఏదో ఒక సంక్షేమ హాస్టల్ లో ఆకస్మిక తనిఖీ నిర్వహించనున్నారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఖమ్మం జిల్లాలోని MJPBCWR JC (బాలికలు) మధిర పాఠశాల, బోనకల్ లో తనిఖీలు నిర్వహించనున్నారు.

మంత్రులు దామోదర రాజనరసింహ, భూపాలపల్లి జిల్లాలోని MJP-BCWR JC(బాలికలు), మైలారం గ్రామం, ఘన్‌పూర్ లలో,

డి శ్రీధర్ బాబు, భూపాలపల్లి జిల్లాలోని MJPBCWR JC(బాలికలు), మైలారం గ్రామం, ఘన్‌పూర్,

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం జిల్లాలోని TGTWR JC (బాలికలు), మాదిరిపురం, తిరుమలాయపాలెం,







పొన్నం ప్రభాకర్, TGSWR JC(బాలుర), షేక్‌పేట, హైదరాబాద్, కొండా సురేఖ, TGSWR JC(బాలురు), హతనూర, సంగారెడ్డి, డి అనసూయ సీతక్క, ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు), నేరడిగొండ, ఆదిలాబాద్, తుమ్మల నాగేశ్వరరావు, ఏకలవ్య మోడల్ RI, TWD,గండుగులపల్లి, దమ్మపేట మండలం, భద్రాద్రి కొత్తగూడం, జూపల్లి కృష్ణారావు, TGSWR JC(బాలికలు), కొల్లాపూర్, నాగర్ కర్నూలలో తనిఖీలు నిర్వహించనున్నారు.

## కండిషన్‌లు పెట్టి తప్పించుకునే ప్రభుత్వం కాదు

మొదటి పేజీ తరువాయి

కూలిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. 4.50 లక్షల ఇళ్లు రాష్ట్ర వ్యాప్తంగా ఇస్తున్నామని మంత్రి క్లారిటీ ఇచ్చారు. 80 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం అభ్యర్థించారని తెలిపారు. ఎవరైతే సొంత స్థలంలో ఉంటారో వారి ఇంటి ఫోటో తీసి యాప్‌లో నమోదు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇంటికి మొదటి విడతగా లక్ష రూపాయలు ఇస్తామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 580 మోడల్ హౌజ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి నాటికి కూసుమంచిలో మోడల్ హౌజ్ నిర్మాణం పూర్తి అవుతుందన్నారు మంత్రి. ఎవరు ఇళ్లు వారే నిర్మించుకునే విధంగా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రజాపాలనలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తిస్తున్నారని తెలిపారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేయని వారు స్పెషల్ కౌంటర్ లో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. దరఖాస్తు చేసిన వారి కుటుంబ సభ్యులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులు దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. పేదవారికి భారం కాకుండా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. గ్రామాలకు సర్వేకు వచ్చే అధికారులు ఇందిరమ్మ కమిటీలను కలుపుకుని పోవాలన్నారు. పేదవారి కలను ఇందిరమ్మ ప్రభుత్వం నెరవేరుస్తుందని మంత్రి పొంగులేటి అన్నారు.

## ఫుడ్ కార్పొరేషన్ అధికారులపై మంత్రి సీతక్క ఫైర్



హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ అధికారులపై మంత్రి సీతక్క ఫైర్ అయ్యారు. ఎఫ్‌సీఐపై మంత్రి రివ్యూ నిర్వహించారు. సమావేశంలో ఫుడ్ కార్పొరేషన్ పని తీరుపై సీతక్క అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు సొంత నిర్ణయాలు తీసుకోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు లేకుండా నామినేష్ పద్దతిలో పనులు కేటాయించడం ఏంటని ప్రశ్నించారు. అధికారులంతా పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. బాల అమృతం ముడి సరుకుల్లో నాణ్యత లోపం ఉంటే సహించేది లేదని నాసిక రకం సరుకులు సప్లై చేసే కాంట్రాక్టర్లు, వారికి సహకరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 2 రోజుల సెలవులు

వరంగల్ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు 2 రోజులు సెలవులు రానున్నాయని మార్కెట్ యాజమాన్యం ప్రకటించింది. ఈ శనివారం వారంతపు యార్డు బంద్, అలాగే ఆదివారం సాధారణ సెలవు కావడంతో ఆ రెండు రోజులు మార్కెట్‌కి సెలవు దినాలుగా ప్రకటించింది. అందువలన రైతులు ఆ రెండు రోజుల్లో మార్కెట్‌కి ధాన్యాన్ని తీసుకొని రావద్దని మార్కెట్ యాజమాన్య అధికారులు సూచించారు. ఆకాల వర్షాల కారణంగా రైతులు తమ పంటను త్వరగా అమ్మాలనుకుంటున్న వేళా ఆ రెండు రోజుల సెలవు వార్త రైతుల చెవులో పిడుగు పాటులా మారింది.




## న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల నిబంధనలు

మొదటి పేజీ తరువాయి

రిసార్టులు, హోటళ్లు, పబ్బులు, వ్యాపార సంస్థలు ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాయి. ఎంతో ఉత్సాహంతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టేందుకు రకరకాల కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎలాంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు తమ పనిలో పడ్డారు. న్యూ ఇయర్ సందర్భంగా నిర్వహించే వివిధ వేడుకలకు హైదరాబాద్ పోలీసులు పలు నిబంధనలు విధించారు. హోటళ్లు, రెస్టారెంట్లు, పబ్‌లలో ఈవెంట్‌ల నిర్వాహకులందరూ తప్పనిసరిగా పాటించాల్సిన పలు నిబంధనలను పోలీసులు వివరించారు.

**పోలీసుల రూల్స్**

ఈవెంట్స్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి
వేడుకల్లో అశ్లీల నృత్యాలు నిషేధం.
ఔట్‌డోర్‌లో రాత్రి 10 తర్వాత లౌడ్ స్పీకర్లు బ్యాన్.
పబ్‌లు, బార్లలో మైనర్లకు అనుమతి నిరాకరణ.
డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు-పోలీసులు.
తాగి వాహనం నడిపితే రూ.10 వేలు జరిమానా, 6నెలలు జైలు.
మైనర్లు వాహనం నడిపితే యజమానిపైన కేసు నమోదు
ర్యాష్ డ్రైవింగ్‌పై వెహికల్ యాక్ట్ కింద కేసు నమోదు.



## పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లకు ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో అంతర్ భాగంగా ప్రవహించే సరస్వతీ నది పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఈ పుష్కరాలకు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్ర భక్తులు కూడా వస్తారని, అందుచేత ఎవరికీ ఎటువంటి ఆటంకాలు రాకుండా చూడాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సచివాలయంలో సమావేశంలో మాట్లాడుతూ సరస్వతీ నదికి వచ్చే ఏడాది (2025లో) పుష్కరాలు రానున్న సందర్భంగా, పుష్కరాల నిర్వహణకు అధికారులు ముందస్తు నివేదికలు సిద్ధం చేయాలని ఆమె పేర్కొన్నారు. మే నెలలో నిర్వహించే సరస్వతి పుష్కరాలకు అధికారులు తమ శాఖల ద్వారా చేపట్టాల్సిన పనులపై అధికారులకు మంత్రి మార్గనిర్దేశం చేశారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణకు ప్రస్తుతం ఉన్నవారితో పాటు స్పెషల్ గా కొంతమందిని నియమించాలని స్థానిక కలెక్టర్ ని, ఈఓని ఆమె ఆదేశించారు. పుష్కరాలు జరిగే గోదావరి, దేవాలయ పరిసర ప్రాంతాల్లో సురక్షిత మంచినీరు ఏర్పాటు చేయాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక, శాశ్వత మరుగుదొడ్లు నిర్మించాలని తెలిపారు. భక్తులు స్నానాల కోసం నల్లాలను, మహిళలు బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. కాళేశ్వరంలో అంతర్గత రోడ్లు తాత్కాలిక రోడ్లు నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలను కూడా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి శాఖకు సంబంధించిన అధికారులు నిబద్ధతతో పనిచేసి పుష్కరాలను విజయవంతం చేయాలని అన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కాళేశ్వరంలో అన్ని ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి తెలిపారు.

## లగచర్ల రైతుకు బేడీలు వేసిన ఘటనపై స్పందించిన కేటీఆర్

మొదటి పేజీ తరువాయి

సంజీవరెడ్డిని సస్పెండ్ చేయడంతో పాటు సూపరింటెండెంట్ సంతోష్ రాయ్‌పై విచారణకు ఆదేశిండంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. చేసే దరిద్రపు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు.

భూమి ఇయ్యను అన్నందుకు గిరిజన రైతులను జైలు లో పెట్టడం ఓకేనట.. జైలులో వారిని చిత్రహింసలు పెట్టడం ఓకేనట.. వారి కుటుంబసభ్యులను అర్ధరాత్రి ఇండ్ల మీద దాడిచేసి భయపెట్టడం, బెదిరించడం ఓకేనట.. నెల రోజులుగా వారికీ చెయ్యని నేరానికి బెయిల్ కూడా రాకుండా అడ్డుపడటం ఓకేనట.. గుండె జబ్బుతో ఉన్న పేషెంటుకు బేడీలు వేయించటం కూడా ఓకేనట అని కేటీఆర్ విమర్శించారు. చేసే దరిద్రపు పనులన్నీ రహస్యంగా చేయించి, ఇప్పుడు కెమెరాల ముందు దొరికిపోగానే అధికారులను బలిపశులను చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై మండిపడ్డారు. నీ నిజ స్వరూపం రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ తెలిసిపోయిందని తెలిపారు. ఇకనైనా క్షమాపణలు చెప్పి కేసులు రద్దు చేయాలని, రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లగచర్ల ఘటనలో రిమాండ్ అయిన హీర్యానాయక్‌కు కంది జైలులోనే బుధవారం మధ్యాహ్నం స్వల్పంగా గండెనొప్పి వచ్చింది. దీంతో జైలు వైద్యులు పరీక్షలు చేశారు. అక్కడే ఈసీజీ తీసి చికిత్స కోసం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ వైద్యశాలకు తరలించారు. సంగారెడ్డి దవాఖానలో ఈసీజీ ఇతర పరీక్షలు చేసిన వైద్యులు మందులు రాసి పంపించారు. బుధవారం రాత్రి మరోమారు హీర్యానాయక్‌కు గండెనొప్పి రావటంతో తిరిగి సంగారెడ్డి దవాఖానకే తీసుకురాగా వైద్యులు చికిత్స చేసి పంపించారు. గురువారం ఉదయం హీర్యానాయక్ గండెనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. జైలు సిబ్బంది అతడిని అంబులెన్స్‌లో కాకుండా జైలు వాహనంలోనే చేతికి బేడీలు వేసి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చారు. సూపరింటెండెంట్



డాక్టర్ అనిల్‌కుమార్ నేతృత్వంలో వైద్యులు అశోక్, మజీద్‌ఖాన్ ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు చేయగా ఆసమయంలోనూ రైతుకు బేడీలు తీయలేదు. పరీక్షలు ముగిసిన తర్వాత మెరుగైన చికిత్స కోసం పంజాగుట్టలోని నిమ్స్‌కు తరలించాలని సూపరింటెండెంట్, వైద్యులు నిర్ణయం తీసుకున్నారు. హీర్యానాయక్ చాలారోజులుగా ఛాతి నొప్పితో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు. 2డీ ఈకో పరీక్ష చేయగా గుండె బలహీనంగా ఉన్నట్టు గుర్తించామని చెప్పారు. సంగారెడ్డిలో కాథల్యాబ్ లేనందున నిమ్స్‌కు రిఫర్ చేయాలని నిర్ణయించినట్టు వివరించారు. అండర్ ట్రయల్‌లో ఉన్న ఖైదీలకు సంకెళ్లు వేయవద్దని గతంలో కోర్టులు చెప్పినా అవేమీ పట్టించుకోండా కంది సెంట్రల్ జైలు పోలీసులు హీర్యానాయక్‌కు సంకెళ్లు వేసి దవాఖానకు తరలించటం తీవ్ర విమర్శలకు దారితీసింది. జైలు అధికారుల తీరును గిరిజన, రైతు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

## కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్

మొదటి పేజీ తరువాయి

చేసిందని నిబంధనలకు విరుద్ధంగా విదేశీ సంస్థలకు నిధులు మళ్లింపులు జరిగాయి. ఫార్ములా ఈ రేసింగ్‌లో అడ్డగోలుగా వ్యవహారం జరిగిందని రేవంత్ సర్కార్ గుర్తించింది. దీంతో ఫార్ములా ఈ రేసింగ్ వ్యవహారంపై దర్యాప్తు ఏసీబీకి ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. 2023లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ రేసింగ్ నిర్వహించింది. అందుకోసం విదేశీ సంస్థతో ఒప్పందం కేసీఆర్ సర్కార్ కుదుర్చుకుంది. ట్యాంక్ బండ్ చుట్టూ మూడు కిలోమీటర్ల మేర ట్రాక్ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించ లేదని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుర్తించింది. ఆర్థిక శాఖ అనుమతులు లేకుండానే ఎమ్‌ఏయూడీ నుంచి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు చెల్లింపులు జరిగాయి. ప్రభుత్వం మారిన తర్వాత ఫార్ములా ఈ నిర్వహించడం లేదని విదేశీ సంస్థలు ప్రకటించాయి. దీంతో అంతర్గత దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో దర్యాప్తుతో ఈ రేసింగ్ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. గత అధికారుల నుంచి ప్రభుత్వం వివరణ కోరింది. ఈ విచారణలో కేటీఆర్ సూచనలతోనే చెల్లింపులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ క్రమంలో కేటీఆర్‌ను విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ సీఎస్ శాంతికుమారికి ఏసీబీ లేఖ రాసింది. కేటీఆర్ విచారణకు అనుమతి ఇవ్వాలంటూ రెండు నెలల క్రితం గవర్నర్‌కు జిష్ణు దేవ్ వర్మకు సీఎస్ లేఖ రాశారు. న్యాయ నిపుణులతో చర్చల అనంతరం కేటీఆర్ విచారణకు గవర్నర్ ఆమోదం తెలిపారు.

## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధింపు

హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): సంధ్య థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాట ఘటనలో అరెస్ట్ అయిన నటుడు అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. అల్లు అర్జున్‌కు 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ 2024, డిసెంబర్ 13న న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పోలీసులు అల్లు అర్జున్‌ను హైదరాబాద్‌లోని చెంచల్ గూడ సెంట్రల్ జైలుకు తరలించడానికి సిద్ధం ఐన తరుణంలో హైకోర్టు అనూహ్య నిర్ణయం తీసుకుంది. చివరి నిమిషంలో అల్లు అర్జున్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. పర్సనల్ బాండ్ తీసుకొని విడుదల చేయాలని పోలీస్ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. అల్లు అర్జున్ తరపున ప్రముఖ సినీ నిర్మాత నిరంజన్ రెడ్డి కోర్టులో వాదనలు వినిపించారు. మరోవైపు ఈ కేసులో పెట్టిన సెక్షన్లు అల్లు అర్జున్‌కు వర్తించవని కోర్టు అభిప్రాయనడింది. యాక్టర్ అయినంత మాత్రాన సామాన్య పౌరుడికి వర్తించే మినహాయింపులను నిరాకరించలేమని పేర్కొంది. అల్లు అర్జున్‌కు కూడా జీవించే హక్కు ఉందని.. కేవలం నటుడు కాబట్టే 105(B), 118 సెక్షన్ల కింద నేరాలను అల్లు అర్జున్‌కు ఆపాదించాలా..? అని ప్రశ్నించింది. రేవతి కుటుంబంపై సానుభూతి ఉంది. అంతమాత్రాన నేరాన్ని నిందితులపై రుద్దలేమని హైకోర్టు అభిప్రాయపడింది.

## రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు

హైదరాబాద్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ప్రజలను అవమానించేలా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుపై జీవో ఇచ్చారంటూ రేవంత్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. అధికార పార్టీది తెలంగాణ వాదం కాదు కాంగ్రెస్ వాదం అంటూ దుయ్యబట్టారు. శుక్రవారం ఆమె మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వారికి పార్టీ ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టవంటూ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై నేడు మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కవిత తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతి పై దాడి జరిగింది. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలను సమానంగా చూశాం. ప్రజల ఆమోదం ఉంటే సీఎంకు భయం ఎందుకు? విగ్రహం తయారు చేసే వరకు ఎందుకు రహస్యంగా ఉంచారు అంటూ కవిత నిలదీశారు. జాగృతి తరపున మేము ఎన్నో ఏళ్లుగా చేస్తున్నాము. మేధావుల అభిప్రాయం తీసుకుని మరింత దూకుడుగా ముందుకు వెళ్తాం. సీఎం రేవంత్ సంకుచిత తత్వంతో వ్యవహరిస్తున్నారు. మేము అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశాము. సోనియా దగ్గర మార్కుల కోసం రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారు. కాంగ్రెస్ కొత్తగా చేసింది ఒక్క తెలంగాణ తల్లి విగ్రహం మాత్రమే. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. ఇది పిరికి ప్రభుత్వం. కార్యకర్తల నుంచి నేతల వరకు అక్రమ కేసులు పెడుతోంది. మేము అక్రమ కేసులకు భయపడం అని కవిత చెప్పారు.

## కానిస్టేబుల్ నాగమణి హత్య కేసులో పోలీసు అధికారిపై వేటు

మొదటి పేజీ తరువాయి

సుధీర్‌బాబు బదిలీ వేటు వేసినట్లు తెలుస్తోంది. రాయపోల్‌కు చెందిన నాగమణి అదే గ్రామానికి చెందిన బండారి శ్రీకాంత్‌ను ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. వీరు పెళ్లైన తర్వాత రక్షణ కోసమని ఇబ్రహీంపట్నం పోలీసులను ఆశ్రయించారు. ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. కులాంతర వివాహం చేసుకున్న అక్కపై కక్షపెంచుకున్న తమ్ముడు పరమేష్ పథకం వేసి నాగమణిని వేట కొడవలితో ఈనెల 2వ తేదీన ఇబ్రహీంపట్నం మండలం, రాయపోల్ వద్ద నరికి చంపిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఓ పోలీసు అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో అతడిపై బదిలీ వేటు వేసినట్లు, కమిషనరేట్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది.

## కేంద్ర ఆర్థిక శాఖ మంత్రితో సీఎం రేవంత్ భేటీ



మొదటి పేజీ తరువాయి

సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ ఎంపీలు మల్లు రవి, బలరామ్‌నాయక్, చామల కరణ్ కుమార్ రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణలు ఉన్నారు. రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, గ్రాంట్లపై ఆర్థిక మంత్రితో చర్చించారు. నిర్మాలా సీతారామన్‌తో భేటీ అనంతరం సీఎం రేవంత్ బృందం రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ తో సమావేశం అయ్యారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన నిధుల మంజూరు, పెండింగ్ ప్రాజెక్టులపై సుమారు గంటపాటు చర్చలు జరిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే రైల్వే మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి శాలువ కప్పి సత్కరించారు.

## లోక్‌సభలో తొలిసారిగా ప్రసంగించిన ప్రియాంక గాంధీ

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో నాలుగు లక్షల మెజార్టీతో గెలుపొందారు. తన సోదరుడు రాహుల్ ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్, రారుబరేలీ స్థానాల నుంచి పోటీ చేసి గెలుపొందారు. అయితే ఒక స్థానానికే ప్రాతినిధ్యం వహించాల్సి రావడంతో వయనాడ్ స్థానానికి ఆయన రాజీనామా చేశారు. దీంతో వయనాడ్ స్థానానికి ఉప ఎన్నిక జరిగింది. తాజాగా జరిగిన ఉప ఎన్నికలో ప్రియాంక భారీ మెజార్టీతో గెలుపొందింది. ఎంపీగా పార్లమెంటులో అడుగుపెట్టిన తర్వాత ప్రియాంక అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రతిపక్షాలు పార్లమెంటు వెలుపల చేసే నిరసనల్లోనూ చురుకుగా పాల్గొంటున్నారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

## ఉపరాష్ట్రపతిపై అవిశ్వాసమా

రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభలో అత్యంత పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఇండియా కూటమి పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాజ్యసభ ఛైర్మన్‌గా వ్యవహరించే ఉపరాష్ట్రపతిపై ఈ విధంగా అవిశ్వాసాన్ని ప్రకటించడం దేశ చరిత్రలో ఇదే మొదటిసారి. ఈ తీర్మానం నెగ్గడానికి కావలసిన బలం విపక్షాలకు లేకపోయినా, పార్లమెంట్ విలువలను కాపాడడానికి, రాజ్యాంగ పరిరక్షణ, సభ్యుల హక్కుల కోసం ఈ నిర్ణయం తీసుకోవలసి వచ్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (ఇన్‌ఛార్జి కమ్యూనికేషన్స్) జైరాం రమేశ్ అభిప్రాయాన్ని వెలిబుచ్చడం ఈ సందర్భంగా గమనించవలసి ఉంది. ఇది వ్యక్తులకు వ్యతిరేకంగా కాదని, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జరుగుతున్న పోరాటమని ఇండియా కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు. ఈ నిర్ణయం బాధాకరమే అయినా పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అవిశ్వాసం పెట్టినట్టు ఇండియా కూటమి పేర్కొంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67 (బి) ప్రకారం కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ (రాజ్యసభ) తీర్మానం ద్వారా ఉపరాష్ట్రపతిని పదవి నుంచి తొలగించవచ్చు. అయితే తీర్మానం ప్రవేశపెట్టినప్పుడు సభలోని సభ్యుల్లో మెజారిటీ ఆమోదించాల్సి ఉంటుంది. తీర్మానాన్ని ప్రతిపాదించడానికి కనీసం 50 మంది సభ్యులైనా ఉండాలి. అయితే ఇండియా బ్లాక్‌కు చెందిన 60 మందికి పైగా సభ్యులు ఈ తీర్మానంపై సంతకాలు చేశారు. సంతకాలు చేసిన వారిలో రాష్ట్రీయ జనతాదళ్, తృణమూల్ కాంగ్రెస్, సిపిఐ, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఆమ్‌ఆద్మీ పార్టీ, డిఎంకె పార్టీలకు చెందిన ఎంపిలు ఉన్నారు. అయితే కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, ఇతర పార్టీల ఫ్లోర్ లీడర్లు తీర్మానంపై సంతకాలు చేయలేదు. ఉపరాష్ట్రపతికి వ్యతిరేకంగా తీర్మానం ప్రతిపాదించడానికి ఈ ఏడాది ఆగస్టులో కూడా ప్రతిపక్షాలు ప్రయత్నించాయి. ఈ తీర్మానం రాజ్యసభతో పాటు లోక్‌సభలో కూడా ఆమోదం పొందవలసి ఉంటుంది. ఈ మేరకు ఉభయసభల్లో మెజారిటీని సాధించడం చాలా కీలకం. సాధారణంగా ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయినప్పుడు, దాని పాలనా సామర్థ్యాన్ని సవాల్ చేయడానికి ప్రతిపక్షాలకు రాజ్యాంగం కల్పించిన హక్కే అవిశ్వాస తీర్మానం. అవిశ్వాస తీర్మానం నెగ్గితే ప్రభుత్వం దిగిపోవాల్సి ఉంటుంది. కానీ ఇప్పుడు ప్రభుత్వంపై అవిశ్వాసం కాదు, రాజ్యసభ ఛైర్మన్ అయిన ఉపరాష్ట్రపతి పక్షపాత వైఖరిపైన అవిశ్వాసం. మనదేశంలో సాధారణంగా లోక్‌సభలోనే ప్రభుత్వంపై లేదా ప్రధాన మంత్రి పైన లేదా కేబినెట్ మంత్రుల పైనా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం చూస్తుంటాం. అవిశ్వాస తీర్మానానికి సభ్యులు మద్దతు ఇచ్చిన తరువాత స్పీకర్ సెలవు మంజూరు చేయవచ్చు. రాజ్యసభలో ఎన్‌డీఏకి పూర్తి మెజారిటీ ఉందని.. ఈ తీర్మానాన్ని తిరస్కరించడం ఖాయమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు వ్యాఖ్యానించారు. 'రాజ్యసభ ఛైర్మన్ మనకు మార్గదర్శి. సభ సజావుగా నడిచేందుకు ఆయన చెప్పేది అందరూ వినాలి. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ఎల్లప్పుడూ ఛైర్మన్‌ను అవమానిస్తుంటాయి' అని ధ్వజమెత్తారు. విపక్షాలకు రాజ్యాంగ నియమాలు తెలియవని.. ఉపరాష్ట్రపతిపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టరాదని బీజేపీ ఎంపీ దినేశ్ శర్మ అన్నారు. 67(బీ) అధికరణ ప్రకారం అభిశంసన తీర్మానం మాత్రమే ప్రవేశపెట్టాలని చెప్పారు. ధన్‌ఖడ్‌పై ఒత్తిడి తేవడానికి విపక్షం ప్రయత్నిస్తోందన్నారు. టీఎంసీ ఎంపీ సాగరిక ఘోష్ మాట్లాడుతూ.. ఈ తీర్మానం ఆమోదానికి తగిన సంఖ్యాబలం తమకు లేదని.. కానీ ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కోసం పోరాడేందుకు బలమైన సందేశంగా పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఏ వ్యక్తిపైనా తమకు ఎలాంటి వ్యతిరేకతా లేదన్నారు. లోక్‌సభలోని నిబంధనలు ప్రకారం 16వ ఎడిషన్‌లోని రూల్ 198 లోని సబ్‌రూల్ (2). (3) కింద తీర్మానంపై చర్చ కోసం ఒకటి రెండు రోజులు కేటాయిస్తుంటారు. ఆ తరువాత దీనిపై ఓటింగ్‌లో తీర్మానానికి అనుకూలంగా మెజారిటీ సభ్యులు ఓటు వేస్తే అది ఆమోదం పొందుతుంది. మనదేశంలో ఈ అవిశ్వాస తీర్మానాలు ఎక్కువగా ప్రధాన మంత్రులపైనే జరిగాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు లోక్‌సభలో 27 అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టారు. కానీ వీటిలో ఏ ఒక్కటీ నెగ్గలేదు. అయితే 1979 జులైలో మొరార్జీదేశాయ్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టగా, దానిపై ఓటింగ్ జరగకముందే ఆయన ప్రధాని పదవికి రాజీనామా చేశారు. అయితే అధికారంలో ఉన్న ప్రభుత్వంపై సభలో ప్రవేశపెట్టిన విశ్వాస తీర్మానాలు మాత్రం మూడు సార్లు ఓడిపోయి ప్రభుత్వాలు పడిపోయాయి. భారత ప్రధానుల్లో ఇందిరాగాంధీ ఎక్కువ అవిశ్వాస తీర్మానాలను 15 వరకు ఎదుర్కొన్నారు. ఇందిరాగాంధీపై తొలి అవిశ్వాసాన్ని 1966లో ఆమె అధికారంలోకి రాగానే కమ్యూనిస్టు నేత హీరేంద్రనాథ్ ముఖర్జీ ప్రవేశపెట్టారు. కేవలం 61 మంది ఎంపిలే మద్దతు ఇవ్వగా, 270 మంది వ్యతిరేకించారు. 1966లోనే ఆమెపై రెండో అవిశ్వాసం వచ్చింది. తరువాత 1967, 1968( రెండు సార్లు), 1969, 1970, 1973, 1974 (రెండు సార్లు ), 1975 (రెండు సార్లు రెండోసారి ఎమర్జెన్సీ విధింపునకు కేవలం నెల రోజుల ముందు) 1976, 1978, 1981 (రెండు సార్లు), 1982 లో ఇందిరపై అవిశ్వాస తీర్మానాలు వచ్చాయి. 1976లో ఇందిర ప్రభుత్వంపై బిజెపి అగ్రనేత వాజ్‌పేయ్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టినా, కేవలం 162 మంది మాత్రమే మద్దతు ఇచ్చారు. 257 మంది వ్యతిరేకించడంతో తీర్మానం వీగిపోయింది. స్వతంత్ర భారత చరిత్రలో మొట్టమొదటిసారి చైనా భారత యుద్ధం జరిగిన తరువాత 1963లో అప్పటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జెబి కృపలానీ లోక్‌సభలో మొట్టమొదటిసారి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నెహ్రూ మాదిరిగానే రాజీవ్ గాంధీ, విపి సింగ్, హెచ్‌డి దేవగౌడ, అటల్ బిహారీ వాజ్‌పేయ్, మన్మోహన్ సింగ్ ఒక్కొక్కసారి మాత్రమే అవిశ్వాస తీర్మానాలను ఎదుర్కొన్నారు. దేశ చరిత్రలో 2023 ఆగస్టు వరకు 31 అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టినట్టు రికార్డయింది. అప్పటి ప్రధానులు లాల్‌బహదూర్ శాస్త్రి, పివి నరసింహారావు మూడేసి సార్లు, మొరార్జీ దేశాయ్, నరేంద్ర మోడీ రెండేసి సార్లు అవిశ్వాసాన్ని ఎదుర్కొన్నారు. 1999 ఏప్రిల్‌లో అప్పటి ప్రధాని వాజ్‌పేయ్ ఒకే ఒక్క ఓటు (269–270) తేడాతో అవిశ్వాస తీర్మానంలో ఓడిపోవలసి వచ్చింది.

## వీరభద్ర స్వామి ఆలయ నూతన చైర్మన్ గా కొర్ను రవీందర్ రెడ్డి



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): మహబూబాబాద్ జిల్లాలోని అతిపెద్ద దేవాలయం కురవి మండలంలోని భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం శుక్రవారం ఆలయ మండపంలో అట్టహాసంగా దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఆర్.సమత నేతృత్వంలో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులు అందరు ప్రతిజ్ఞ చేశారు. సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో ఆలయ చైర్మన్ ను ఎన్నుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ గా దేవస్థానం సన్నిధిలో గల చైర్మన్ కార్యాలయంలో వేద పండితుల మంత్రోత్సవాల నడుమ వేదాఆశీర్వాదా లతో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో కురవి మండలం నేరడ గ్రామానికి చెందిన కొర్ను రవీందర్ రెడ్డి చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు,గ్రామ ప్రజలు, మహబూబాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి వీరభద్రం గౌడ్,చందు నాగన్న,నజీర్, ఇరుగు వెంకన్న,ఉపేందర్, కొర్ను కృష్ణారెడ్డి,నూకల మల్లయ్య దిలీప్,జనార్ధన్,మాజీ జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, గుండ్రాతిమడుగు సొసైటీ చైర్మన్ గార్లపాటి వెంకటరెడ్డి, తదితరులు ఘనంగా సత్కరించారు.

## ఇసుక తరలిస్తున్న టిప్పర్లు పట్టివేత



**– మండలం ఎస్సై శేఖర్**

దేవరకద్ర ప్రతినిధి,డిశంబర్13(తీన్మార్ న్యూస్) అనుమతి లేకుండా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రానికి చెందిన 5 ఇసుక బెంజ్ టిప్పర్లను బండరుపల్లి గ్రామము దగ్గర అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 5 బెంజ్ టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని చిన్న చింతకుంట మండలం ఎస్సై శేఖర్ హెచ్చరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



పరకాల, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): పేదలు, కార్మికులు, ఉద్యోగులు, కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సిపిఎం హనుమకొండ జిల్లా రెండవ, మహాసభలు డిసెంబర్ 14, 15వ, తేదీలలో హసన్పర్తి లో జరుగుతున్నాయని, వాటిని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి. తిరుపతి పిలుపునిచ్చారు. పరకాల అమర దామంలో సిపిఎం మహాసభల కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడారు. జిల్లాలోని ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలు, కార్మికులు, కర్షకులు పేదలు మహిళలు తదితర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం భవిష్యత్తు కార్యచరణ రూపొందించడం కోసం ఈ మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్రంలో బిజెపి గత పది సంవత్సరాలుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామిక రంగాన్ని వ్యవసాయ రంగాన్ని దివాళ తీశాయి. విద్య వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షగా మారింది ఆర్థిక అసమానతలు పెద్ద ఎత్తున పెరిగాయి. ప్రజలు చెమటోర్చి నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం అంబానీ, ఆదాని లాంటి బడా కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా కట్టబడుతుంది. దేశంలో ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు, రాష్ట్రాల హక్కులపై రాజ్యాంగం పై దాడి చేస్తుంది. దేశ సంపదను కొల్లగొడుతూ పెట్రోల్, డీజిల్, గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలు పెంచి భారం మోపుతుందని, అన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుకై ఉద్యమాలకు ప్రజలను సిద్ధం చేసేందుకు కోసం జరుగుతున్న మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మడికొండ ప్రశాంత్, ఓర్సు చిరంజీవి, మాటూరు సతీష్, బి.నిఖిల్ లు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ఆత్మకూర్, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం పిన్నంచర్ల గ్రామంలో గ్రామ అభివృద్ధిలో భాగంగా మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి సహకారంతో మంజూరైన 10 లక్షల రూపాయలతో గ్రామంలోని గొల్ల సత్యనారాయణ ఇంటి నుండి దర్గా వరకు కురువ నరసింహ ఇంటి నుండి గ్రామపంచాయతీ వరకు పది లక్షల రూపాయలతో నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి ఆత్మకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరమేష్ టౌన్ అధ్యక్షులు శ్రీనివాసులు మాజీ మండల అధ్యక్షులు రహమతుల మక్తల్ మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెద్ద ఎత్తున గ్రామాలలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో గణేష్ ముదిరాజ్ మహేందర్ గౌడ్ మనివర్ధన్ రెడ్డి హుజూర్ రాములు ఆత్మకూరు మండలం మహిళా సంఘం అధ్యక్షురాలు విజయలక్ష్మి కురువ రామచంద్రి సత్యన్నా కాజన్న విష్ణు తదితరులు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## విద్యాశాఖకి మంత్రిని కేటాయించాలి

### రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం
### ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్




హనుమకొండ కేయు, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీ రెండొవ గేట్ ముందు విద్యాశాఖకి మంత్రి నీ ఇప్పటి వరకు కేటాయించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ దిష్టి బొమ్మని ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది. అనంతరం ఏ బీ ఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ రాష్ట్రములో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పటై సంత్సరము గడుస్తున్నా కానీ విద్యాశాఖ కి మంత్రి నీ కేటాయాంచకుండా విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి అన్యాయం చేయడం చాలా బాధాకరం అని అన్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విద్యార్థులకు న్యాయం చేస్తాము అని హామీ ఇస్తే విద్యార్థి లోకం కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపిస్తే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రములో అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి విద్యాశాఖ కి మంత్రినీ కేటాయించకుండా పూర్తిగా విద్యార్థి లోకానికి అన్యాయం చేయడం సిగ్గు చెటని మంద నరేష్ అన్నారు విద్యాశాఖ కి మంత్రి నీ కేటాయించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళన చేదడం జరుగుతుందనీ అన్నారు ఇప్పటికైనా విద్యాశాఖ కి మంత్రినీ కేటాయించి విద్యార్థులకు న్యాయం చేయకుంటే జిల్లాలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామనీ మంద నరేష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఏ బీ ఎస్ ఎఫ్ నాయకులు గౌతమ్ రాహుల్ కిరణ్ రాజ్ సాయి సూర్య తేజ్ చైతన్య తదితరులు పాల్గొన్నారు

## శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర, పరిశోధనలపై ఉపన్యాస పోటీలు

హనుమకొండ, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ మరియు పీజీ విద్యార్థులకు రామానుజన్ జీవిత చరిత్ర మరియు ఆయన గణితశాస్త్ర రచనలపై ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఈ ఉపన్యాస పోటీలకు వరంగల్ జిల్లా విద్యార్థులు పాల్గొనవచ్చు. విద్యార్థులలో గణిత శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించేందుకు మరియు రామానుజన్ కృషిని తెలియజేయడంలో ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల ద్వారా రామానుజన్ జీవిత విశేషాలు, గణితం అభివృద్ధి చేయడంలో రామానుజన్ కృషి మరియు గణితం జీవితంలో ఒక భాగం అని తెలపడమే ముఖ్య ఉద్దేశం అని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి తెలిపారు. ఈ నెల 19న 10 గంటలకు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఉపన్యాస పోటీల కార్యక్రమం నిర్వహించబడును. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాలకు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విభాగ ఇన్చార్జి అధిపతి డాక్టర్ టి. నాగయ్య 9701275354 ను సంప్రదించగలరు.

## జాతీయ కార్యక్రమాలను జిల్లాలో 100శాతం అమలు జరిగేలా చూడాలి

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.జి. మురళీధర్



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డాక్టర్ జి మురళీధర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు జాతీయ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి నూతనంగా వచ్చిన వైద్యాధికారులకు పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని జాతీయ కార్యక్రమంలో భాగంగా మెటర్నల్ చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం, చైల్డ్ హెల్త్ ఇమ్యూ నైజేషన్, అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం, నేషనల్ మలేరియా ప్రోగ్రాం, నేషనల్ టిబెర్క్యులోసిస్ కంట్రోల్ ప్రోగ్రాం, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, లెప్రసీ, ప్రోగ్రాములు సమీక్షిస్తూ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని, సిజేరియన్ తగ్గించాలని, గర్భిణీ స్త్రీలను 12 వారాల్లో నమోదు చేయాలని, రక్తహీనత ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి ఐరన్ అండ్ పోలిక్ యాసిడ్ టాబ్లెట్స్ అందించాలని, ఆ సంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్, క్యాన్సర్ లను 30 సంవత్సరాల పైబడిన వారందరినీ పరీక్షించాలని పేర్కొనడం జరిగింది. వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన దగ్గర నుండి ఐదు సంవత్సరాలు పిల్లలందరికీ అందించాలని 100 శాతం అయ్యేలాగా చర్యలు తీసుకోవాలని, క్షయ వ్యాధి ప్రోగ్రాం సమీక్షిస్తూ రెండు వారాల మించి దగ్గు ఉన్నచో తెమడ పరీక్ష చేసి, క్షయ వ్యాధి ఉన్నట్టయితే ఆరు నెలలు మందులు వాడినచో క్షయ వ్యాధి నయమగునని పేర్కొన్నారు. లెప్రసీ కేస్ డిటెక్షన్ రాగి వర్ణం కలిగి, స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వైద్యాధికారిని సంప్రదించాలిని అన్నారు. అన్ని జాతీయ కార్యక్రమాలను జిల్లాను ముందంజలో ఉంచాలని వైద్యాధికారులతో అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ ప్రమీల, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ సారంగం, డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్స్ కె.వి.రాజు, గీత, సబ్ యూనిట్ ఆఫీసర్ రామకృష్ణ, డి డి ఎం సోమిత్,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## నాగారం డ్రగ్ అసోసియేషన్ అధ్యక్షుడుగా భీమ్ రావు పాటిల్



నాగారం, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): డ్రగ్ అసోసియేషన్ అధ్యక్షుడుగా నూతనంగా ఎన్నికైనా భీమ్ రావు పాటిల్ ను ట్రినిటీ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ తరపున అమృత్ రాజ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన డ్రగ్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమ్ రావు పాటిల్ ని శాలువాతో ఘనంగా సన్మానించి, పూల భోకె ను అందజేశారు. ఈ సందర్భంగా అమృత్ రాజ్ మాట్లాడుతూ.. అసోసియేషన్ కమిటీ సభ్యులు ఫార్మసీ రంగంలోని సహచరులను అభినందిస్తూ, సమిష్టి కృషి ద్వారా నాగారం ఫార్మసీ రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. నాగారం ఔషధ సమాజానికి ప్రోత్సాహకరమైన ముందడుగుగా నిలుస్తోందని అన్నారు.

## అర్హులైన కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే లక్ష్యం



పరకాల, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన నేడు అమలు చేసిన ఆరు గ్యారంటీల పథకాలలో భాగంగా ఇందిరమ్మ రాజ్యం – ఇంటింటి సౌభాగ్యం అనే రీతిలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో నిరుపేదలను గుర్తించి, ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే లక్ష్యంగా చేసుకొని, పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ పరకాల మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ ల ఆదేశాల మేరకు నేడు రెండో వార్డులో ఇంటింటి సర్వేలో భాగంగా పాల్గొన్న వార్డ్ ఆఫీసర్ రవి సార్తో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొమ్మకంటి రుద్రమదేవి– చంద్రమౌళి(ఎస్సీ విభాగం అధ్యక్షులు) 2వ వార్డ్ సోషల్ మీడియా ఇంఛార్జి బొచ్చు జెమిని, కాంగ్రెస్ నాయకులు బొచ్చు సంపత్, ఒంటేరు వరుణ్, బొచ్చు రవి కుమార్, బొచ్చు అనిల్, బొచ్చు రాజు బొచ్చు నాగరాజు, జూపాక కిషన్ పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే క్షేత్రస్థాయిలో పూర్తి చేయాలి

**- సర్వే కోసం (113) మంది సూపర్వైజర్లు, (547) మంది సిబ్బంది**

**- సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలనకు జిల్లాస్థాయి ప్రత్యేక అధికారుల నియామకం**

**- జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



మహబూబాబాద్ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదవారికి,అర్హులైన వారందరికీ ఇండ్లు మంజూరి కోసం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రవేశపెట్టిందన్నారు. శుక్రవారం సంబంధిత అధికారులతో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజా పాలనలో లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో, పట్టణ ప్రాంతంలో వచ్చిన దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా అప్లోడ్ చేస్తున్న సర్వే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలని, ఈ దరఖాస్తులన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ ద్వారా గ్రామపంచాయతీలలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలలో వార్డు అధికారులు పరిశీలించుటకు వారికి సంబంధిత లాగిన్స్ ఇవ్వడం జరిగిందని అన్నారు. గ్రామ పంచాయతీలు,వార్డు పరిధిలలో పంచాయతీ సెక్రటరీలు, వార్డ్ ఆఫీసర్లు ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన కార్యక్రమాన్ని ఖచ్చితమైన సమాచారం సేకరించి పూర్తిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం మోడల్ గృహాలను అన్ని మండల కేంద్రాలలో నమూనా ఇండ్లను నిర్మించడం జరుగుతున్నన్నారు. ఇప్పటికే జిల్లాలో (487) గ్రామపంచాయతీ (82) పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ కమిటీలు వేయడం జరిగిందని, వారిని సైతం పంచాయతీ కార్యదర్శులతో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలనలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. దరఖాస్తుదారు ప్రభుత్వ సూచనల ప్రకారం బిపిఎల్ కార్డు వర్గం, ప్రస్తుత నివాస గృహానికి సంబంధించిన పూర్తి వివరాలు, కులం,చిరునామా, అన్ని వివరాలతో పాటు, ప్రస్తుతం ఉన్న ఇంటి దగ్గర తీసుకున్న ఫోటో, ఇంటి పరిస్థితిపై లోపల,బయట ఫోటోలు,అలాగే కొత్తగా నిర్మించతలపెట్టిన స్థలం, దానికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్ లో అప్లోడ్ చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు (5748) దరఖాస్తులను ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందని, మిగతా దరఖాస్తులను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. సర్వే చేస్తున్న క్రమంలో అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంపై హర్షం వ్యక్తం చేస్తున్నారని, గ్రామ,పట్టణ,వార్డు స్థాయిలో చేస్తున్న సర్వే వివరాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీర బ్రహ్మాచారి, పర్యవేక్షించడం జరుగుతుందని, జిల్లా కేంద్రంలో గృహ నిర్మాణ విభాగం సిబ్బంది పనిచేస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం అమలుకు జిల్లా యంత్రాంగం పక్కాగా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతుందని కలెక్టర్ తెలిపారు.

# దరఖాస్తుదారుల పూర్తి వివరాలను యాప్ లో నమోదు చేయాలి

**ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ పర్యవేక్షణ**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**






జనగామ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): మున్సిపల్ పరిధిలోని 20, 2వ వార్డుల్లో నిర్వహిస్తోన్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను శుక్రవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సమాచారం అడిగి తెలుసుకున్నారు. సొంత స్థలం ఉందా.. ప్రస్తుతం ఉంటున్న ఇల్లు ఎవరిది.. ఖాళీ స్థలం ఉంటే ఎక్కడ ఉంది,అందుకు సంబంధించిన పత్రాలు ఉన్నాయా.. అని ఆరా తీశారు. అలాగే దరఖాస్తుదారుల పూర్తి వివరాలను యాప్ లో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. సర్వే చేపట్టే వార్డులకు సంబంధించిన దరఖాస్తుదారులకు ముందుగానే సమాచారాన్ని అందించాలన్నారు. అలాగే నియమనిబంధనలను పాటిస్తూ.. ఎటువంటి తప్పులు లేకుండా సరైన విధంగా సమాచారాన్ని సేకరించి, ఆన్లైన్లో నమోదు చేయాలని సర్వేయర్ లను కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రక్రియలో భాగంగా సర్వే వేగవంతం అయ్యేందుకు సంబంధిత పత్రాలను దరఖాస్తుదారులు అందుబాటులో ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీవో గోపీరామ్, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో 09 కేంద్రాలు.. 2195 మంది అభ్యర్థులు

**- అధికారులు.. సిబ్బందికి శిక్షణ పూర్తి**

**- టీజీపీఎస్సి వెబ్ సైట్ లో అందుబాటులో అభ్యర్థుల హాల్ టికెట్లు**

**- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): జిల్లాలో గ్రూప్-2 పరీక్ష నిర్వహణకు మొత్తం 09 కేంద్రాలు టీజీపీఎస్సి ఏర్పాటు చేసింది. పరీక్షల విధుల నిర్వహణపై అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి. ఇప్పటికే అభ్యర్థుల హాల్ టికెట్లు వెబ్ సైటులో అందుబాటులో ఉంచింది. టీజీపీఎస్సి ఆద్వర్యంలో గ్రూప్-2 నిర్వహణకు కలెక్టర్ దివాకర టి.ఎస్. నేతృత్వంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ అందించారు. ఏర్పాట్లు పూర్తి. టీజీపీఎస్సి ఆద్వర్యంలో గ్రూప్-2 నిర్వహణకు అధికారులు జిల్లా వ్యాప్తంగా మొత్తం 09 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటిలో కావాల్సిన సౌకర్యాలు సమకూర్చారు. ఈ పరీక్షకు జిల్లా నుంచి మొత్తం 2195 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. వీరిలో 55 మంది దివ్యంగులు అందులో 6 స్క్రైబ్స్ ఉన్నారు. అలాగే డిపార్ట్మెంటల్ అధికారులు, చీఫ్ సూపరిండెంట్లు, అబ్జర్వర్లు 26 చొప్పున నియమించారు.

**ఇవీ కేంద్రాలు**

తెలంగాణ మోడల్ స్కూల్ కాలేజ్ నియర్ మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ బండారుపల్లి,జీవంతరావుపల్లి ములుగు, బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ నియర్ మహర్షి క్యాంపస్ ములుగు, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ గట్టమ్మటెంపుల్ దగ్గర ప్రేమ్ నగర్ ములుగు, గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ జిల్లా ఏరియా ఆసుపత్రి ఎదురుగా ములుగు, జిల్లా పరిషత్ హై స్కూల్ బాయ్స్ డిసిసి బ్యాంక్ ప్రక్కన ములుగు, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ బాయ్స్, డి ఆర్ డి ఏ ఆఫీస్ దగ్గర జాకారం, లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ హెచ్పి గ్యాస్ ఏజెన్సీ ఎదురుగా ములుగు, బ్రిలియంట్ గ్రామర్ హై స్కూల్ డిఎల్ఆర్ గార్డెన్ దగ్గర ములుగు, సదానందం హైస్కూల్ నియర్ బీపీసీఎల్ పెట్రోల్ పంప్ దగ్గర ములుగు.

**అభ్యర్థులకు సూచనలు**

పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం సెషన్ లో 8.30 నుంచి, మధ్యాహ్నం సెషన్ లో 1.30 నుంచి అనుమతించడం జరుగుతుంది. పరీక్ష కేంద్రాల గేటు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు మూసి వేస్తారు. దీని తర్వాత పరీక్ష కేంద్రాలకు ఎవరిని అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు తమ వెంట బ్లూ/బ్లాక్ పాయింట్ పెన్నులు, ఫోటోతో కూడిన హాల్ టికెట్, ప్రభుత్వం చేజారి చేసిన ఒరిజినల్ ఫోటో ఐడి కార్డ్ తీసుకుని రావాలి. హాల్ టికెట్ పై పాస్పోర్ట్ సైజ్ ఫోటో ముద్రించి తీసుకెళ్ళాలి. ఒకే హాల్ టికెట్ ను పరీక్ష మొత్తం వినియోగించాలి. హాల్ టికెట్ లో ఫోటో సరిగ్గా లేకపోతే అభ్యర్థి 3 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు గెజిటెడ్ అధికారి లేదా చివర చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ సంతకంతో తీసుకువచ్చి పరీక్షా హాల్లో ఇన్విజిలేటర్ కు అప్పగించాలి. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక రోజు ముందు వచ్చి చూసుకోవాలి. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు క్యాలిక్యులేటర్, సెల్ ఫోన్, పెన్ డ్రైవ్ ,బ్లూ టూత్ డివైసెస్, జువెలరీ, ఎలక్ట్రానిక్ గాడ్జెట్ మొదలగు సామాగ్రి తీసుకుని రావడానికి వీల్లేదు. చెప్పులు మాత్రమే వేసుకుని రావాలి. షూస్ వేసుకోవద్దు. సెల్ఫోన్ బ్లూటూత్ ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అభ్యర్థులు తీసుకువచ్చినట్లైతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారు. బయోమెట్రిక్ ప్రక్రియ పూర్తయ్యే వరకు అభ్యర్థులు పరీక్ష హాల్ విడిచి వెళ్ళరాదు. బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల ఓఎంఆర్ షీట్ వ్యాలీడ్ కాదు. బయోమెట్రిక్ విధానం ఉన్న నేపథ్యంలో అభ్యర్థులు మెహందీ టాటూ వంటివి పెట్టుకోవద్దు. ప్రతి పేపర్ సమయంలో అభ్యర్థి ఇన్విజిలేటర్ సమక్షంలో హాల్ టికెట్ పై సంతకం పెట్టాలి. మోడల్ ఓ.ఎం.ఆర్ షీట్ల ను వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకుని సరిగ్గా బబుల్స్ చేయడం ప్రాక్టీస్ చేయాలి. ఓ.ఎం.ఆర్ షీట్ ను సరిగా చెక్ చేసుకోవాలి. పరీక్ష ముగిసే వరకు అభ్యర్థులు పరీక్షా హాల్ ను విడిచి వెళ్లడానికి వీలులేదు.

**గంట ముందే చేరుకోవాలి**

గ్రూప్-2 పరీక్ష రాసే అభ్యర్థులు వారికీ కేటాయించిన కేంద్రానికి నిర్దేశిత సమయానికంటే గంట ముందే చేరుకోవాలి. టీజీ పీఎస్ సి నిబంధనలు కచ్చితంగా పాటించాలి. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఇప్పటికే సౌకర్యాలు కల్పించాము.

# 47 ఏళ్లుగా అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నా

**- గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట**

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): నా రాజకీయ జీవితంలో 47 ఏళ్లుగా దమ్మపేట అశ్వరావుపేట ప్రాంతాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశానని, ఆది నుంచి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ఎజెండాగా ముందుకు సాగుతున్నానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం దమ్మపేట మండలంలో అల్లిపల్లి గ్రామంలో రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ భవనం,రూ. 29 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రహదారితో పాటు కల్వర్టు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం అల్లిపల్లి గ్రామంలో గ్రామస్తులు స్వయంగా నిర్మించుకున్న ప్రభుత్వ పాఠశాల భవనాన్ని ప్రారంభించిన మంత్రి అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ నా రాజకీయ జీవితంలో ఎన్నో పదవులను కట్టబెట్టిన సొంత మండలం దమ్మపేట అభివృద్ధి కోసం ఆది నుంచి కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. దమ్మపేట, అశ్వరావుపేట ప్రజల ఆశీర్వాదం వల్లనే ఈరోజు అన్ని ప్రభుత్వాల్లో మంత్రిగా కొనసాగే భాగ్యం కలిగిందన్నారు. ఇక్కడి రైతులు పామాయిల్ రంగంలో రాణిస్తూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్నారని గుర్తు చేశారు. ఈ ప్రాంతాల అభివృద్ధిని చూసి పక్క రాష్ట్ర ప్రజలు సైతం మెచ్చుకుంటున్నారని, దమ్మపేటను ఆ రోజుల్లోనే ఆదర్శంగా తీర్చిదిద్దామని స్వయంగా ఎన్టీ రామారావు అభినందించారని చెప్పారు. ఈ ప్రాంతంలో అన్ని వర్గాల ప్రజలు నివసిస్తున్నారని గిరిజనుల భూముల్లో గిరిజనలే వ్యవసాయం చేసుకోవాలని, గిరిజనేతరులు సాగు చేయడానికి వీలులేదని అన్నారు. ఇక్కడ రైతులు ఎవరి భూముల్లో వారే సాగు చేసుకుంటున్నారని వాటికి హక్కు కల్పించాల్సిన అవసరం అధికారులకు ఉందన్నారు. దశాబ్దాలుగా రాజకీయ రంగంలో కష్టపడి పని చేస్తూ ప్రజలకు కావలసిన తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులను కల్పించి వారి అవసరాలను తీర్చానని మంత్రి అన్నారు. ఈ ప్రాంతాల అభివృద్ధి కోసం మరిన్ని నిధులను తీసుకువచ్చి ప్రతి మారుమూల గ్రామానికి రహదారి సౌకర్యాన్ని కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని ఆయన అన్నారు. అనంతరం అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా రైతులకు అవసరమైనటువంటి గ్రావెల్ రోడ్లు, మెటల్ రోడ్లు వేయడానికి గాను సుమారు 25 కోట్ల 66 లక్షల 48 వేల 375 రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. మంజూరు అయిన పనులు అన్నిటిని మార్చి నెల లోపల పూర్తి చేయాలన్నారు. ఇంకా ఎవరైనా రైతులు తమ పొలాలకు వెళ్ళు పొలం బాట అవసరమైనచో సంబంధిత ఎంపీడీవో కార్యాలయం లేదా పంచాయతీ కార్యాలయాల్లో లిఖితపూర్వకంగా దరఖాస్తు చేయాలని తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయరంగ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో నాగలక్ష్మి ,కొత్తగూడెం ఆర్డీవో మధు, పంచాయతీరాజ్ కాశయ్య,ఆలపాటి ప్రసాద్ మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో మైనింగ్ టాస్క్ ఫోర్స్ సమీక్ష



వరంగల్ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైనింగ్ టాస్క్ ఫోర్స్ సమీక్ష సమావేశం నిర్వహించడమైనది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి లు పాల్గొని జిల్లాలోని వివిధ మండలాల తాహాసిల్దార్లు, జిల్లా పోలీసు అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించడమైనది. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో మైనింగ్ టాస్క్ ఫోర్స్ అధికారులు ఆర్డీవోలు, కమిషనర్ ఆఫ్ పోలీస్, మైన్స్ అండ్ జువాలజీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఇరిగేషన్, జిడబ్ల్యూఎంసి డిప్యూటీ కమిషనర్, ఆయా మండలాల తాసిల్దార్లు ఎంపీడీవోలతో కమిటీలుగా ఏర్పాటు చేసి జిల్లాలో నిర్వహిస్తున్న మైనింగ్ అనుమతుల వివరాలు పనిచేస్తున్న మైనింగ్ మరియు మూసివేయబడిన మైనింగ్ ల నివేదికలను తయారు చేసి సమర్పించవలసినది ఆదేశించడమైనది. అట్టి నివేదికలు ఇప్పటికీ సమర్పించబడని అధికారులతో సమీక్ష నిర్వహించి ఈ రోజు సాయంత్రం వరకు నివేదికలు సమర్పించవలసినదినదిగా సంబంధిత అధికారులను ఆదేశించడమైనది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గురుకులాల విద్యాలయాల సంక్షేమ వసతి గృహాల్లో రేపు జరగబోయే డైట్ చార్జీల పెంపు ప్రత్యేక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను, విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించే ప్రత్యేక కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత మండల తాసిల్దార్లను ఆదేశించడమైనది. ఈ కార్యక్రమంలో ఎడి మైన్స్ రవి శంకర్, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, జి డబ్ల్యూ ఎం సి డిప్యూటీ కమిషనర్ కృష్ణా రెడ్డి, సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# ఏజెన్సీ ప్రాంతాల్లో ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఓటరు నమోదు పై ప్రత్యేక దృష్టి సాధించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ కు వచ్చిన ఆయనకు మొదట జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఘనంగా స్వాగతం పలికారు.. అనంతరం ఐడిఓసి కార్యాలయంలో ఎన్నికల విభాగం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఈఓ మాట్లాడుతూ జిల్లాలో నూరు శాతం ఓటరు నమోదు కార్యక్రమాన్ని తప్పనిసరిగా చేయాలని సూచించారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలన్నారు. దివ్యాంగులు, ట్రాంజెండర్లను గుర్తించి నేరుగా అధికారులే వెళ్లి ఓటు కోసం దరఖాస్తుకు అవగాహన కల్పించాలన్నారు. అలాంటి దరఖాస్తులను ఈనెల 25 లోపు పరిష్కరించుకోవాలని అధికారులను ఆదేశించారు. బిఎల్వోలు ప్రతీ రికార్డును అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని అధికారులు సైతం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. వివిధ రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తూ సలహాలు సూచనలను తీసుకోవాలని చెప్పారు. బిఎల్వో వ్యవస్థను మరింత ప్రతిష్టపరిచేలా చూడాలని తాసిల్దార్లకు సూచించారు. ఎమ్మెల్సీ ఓటర్ నమోదును మరింత చురుగ్గా నిర్వహించాలని ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఇతర ప్రాంతాల్లో ఉంటే పరిశీలన చేసి వారికి అవగాహన కల్పించాలని సీఈవో చెప్పారు. ఓటరు నమోదుతో పాటు సవరణల్లో భాగంగా మార్పులు, చేర్పులు, ఓటరు గుర్తింపు కార్డుల జారీ వంటివి ఎప్పటికప్పుడు చేపడుతూ ప్రజలకు సహకరించాలని అధికారులకు ఆదేశించారు. ఓటరు నమోదు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఓటరు నమోదు ప్రక్రియ, సవరణల వంటి వాటిపై ఎప్పటికప్పుడు గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు, గతంలో ఓటరు నమోదు కోసం జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు, ప్రస్తుతం చేపడుతున్న అంశాలను సీఈఓ వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన తహసిల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రిస్మస్ వేడుకలను పకడ్బందీగా నిర్వహించాలి

**పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



హనుమకొండ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 2024 క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించాలని శుక్రవారం హనుమకొండ జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి,వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లపై క్రైస్తవ పాస్టర్లు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల కోసం తగిన ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా రూపొందించు కోవాలన్నారు. క్రిస్మస్ పండుగను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా శాంతియుతంగా జరుపుకోవాలని, పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పకడ్బందీగా అనుసరించాలని సూచించారు. అనంతరం పాస్టర్స్ మత ప్రబోధకులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి మురళీధర్ రెడ్డి, పాస్టర్ ఐజాక్ హనుమకొండ, పరకాల ఆర్డీఓ లు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, అన్ని మండలాల తహసీల్దార్ లు, క్రైస్తవ పాస్టర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలి

**జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్ల పరిశీలన**

**జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్**



జనగామ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): శుక్రవారం, జిల్లాలోని పెంబర్తి గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వేయర్ లు సర్వే చేస్తున్న తీరును, దరఖాస్తుదారుల వివరాలను ఆన్లైన్ లో నమోదు చేసే విధానాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే వివరాల



నమోదులో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఎటువంటి నిర్లక్ష్యం తగదని, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా అనుసరించాలని, దరఖాస్తుదారుల వివరాల సేకరణలో ఖచ్చితత్వం పాటించాలని సర్వేయర్ లకు సూచించారు. అనంతరం జిల్లాకేంద్రంలోని ధర్మకంచలో గల మినీ స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను పర్యవేక్షించి, మాట్లాడారు. ఈ నెల 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు జరగనున్నట్లు తెలిపారు. అందుకు తగ్గట్లుగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని, మౌలిక వసతులను కల్పించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా చెత్తచెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట డిప్యూటీ సీఈఓ సరిత, డీవైఎస్ఓ వెంకట్ రెడ్డి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలి

హనుమకొండ జిల్లా, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): ఈ నెలాఖరు లోగా ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వేను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావిణ్య సర్వే అధికారులకు ఆదేశించారు. శుక్రవారం హసన్పర్తి మండలంలోని భీమారం, పెంబర్తి గ్రామాలలో సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భూమి ఉండి గృహ నిర్మాణం కోసం సమగ్ర సర్వే ద్వారా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా సర్వే నిర్వహిస్తున్న ప్రత్యేక బృందాల పనితీరును, లబ్ధిదారుల వివరాలను పొందుపరచు తీరును సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులు గృహ నిర్మాణానికి అవసరమైన స్థలంతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డును పరిశీలించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. రేషన్ కార్డు లో తప్పనిసరిగా లబ్ధిదారుల పేరును ఉండేలా చూడాలని తెలిపారు. అదేవిధంగా సర్వేలో పూర్తిగా సేకరించిన లబ్ధిదారుల వివరాలను యాప్ ద్వారా నమోదు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని సర్వే అధికారులను ఆదేశించారు. నమోదు ప్రక్రియలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు.



దరఖాస్తుదారులు ఒకచోట నివసిస్తూ ఉండి వారికి వేరొక ప్రదేశంలో స్థలం ఉన్నట్లయితే అటువంటి దరఖాస్తులను తీసుకొని వివరణలో తగిన వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి దరఖాస్తు వివరాలు యాప్ లో నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, 2 బిహెచ్కెనోడల్ అధికారి రాజేంద్రప్రసాద్, తహసిల్దార్ ప్రసాద్, మండల అభివృద్ధి అధికారి ప్రవీణ్, ఎంపిఓ కరుణాకర్ రెడ్డి, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**- పరీక్షల నిర్వహణలో అధికారుల పాత్ర కీలకమైనది**

**- ఎస్వీ డిగ్రీ కళాశాలలో శిక్షణ కార్యక్రమం**

**- అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి**

**- అదనపు కలెక్టర్ పి రాంబాబు**



సూర్యాపేట, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): గ్రూప్ -2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని జిల్లా అదనపు రెవిన్యూ కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో గ్రూప్ 2 రీజినల్ కోఆర్డినేటర్ కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ డాక్టర్ వి వెంకటేశులతో కలిసి చీఫ్ సూపర్ ఇంటెండెంట్ లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15,16 తేదీలలో గ్రూప్ 2 పరీక్షలు రెండు రోజులపాటు జరగనున్నాయని పేర్కొన్నారు. సూర్యాపేట పట్టణంలో 30 సెంటర్లు ఏర్పాటు చేశామని అభ్యర్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.పరీక్ష నిర్వహణలో చీఫ్ సూపర్ ఇంటెండెంట్ ల పాత్ర కీలకమైనదని ఇన్విజిలేటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. గ్రూప్ 3 పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశామని అదే స్ఫూర్తితో గ్రూప్ 2 పరీక్షను సైతం విజయవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ లు , బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి..

**- జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని**

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి..



ములుగు: విద్యార్థులు విద్యార్థి దశ నుండే సైన్స్ పై మక్కువ పెంచుకొని నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని, మూస పద్ధతిలో కాకుండా విభిన్న ఆలోచనల ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకొని ముందుకు సాగాలని ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి జి పాణిని అన్నారు. ములుగు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో డీఈవో జి పాణిని అధ్యక్షతన నిర్వహించబడిన రెండు రోజుల బాల వైజ్ఞానిక ప్రదర్శిని, ఇన్స్పైర్ మనక్ ముగింపు సమావేశంలో వారు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శిని, ఇన్స్పైర్ మనక్ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు గాను సైన్స్ అధికారి అప్పని జయదేవ్, కమిటీ కన్వీనర్లు సభ్యులను డీఈవో అభినందించారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయికి ఎంపిక కాబడినటువంటి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి గైడ్ టీచర్లు, ప్రధాన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయుటకు సహకరించినటువంటి ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలియజేస్తూ, విద్యాశాఖ నుండి నిర్వహించే అన్ని కార్యక్రమాలలో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని ములుగు జిల్లాను తెలంగాణ రాష్ట్రంలో విద్యాపరంగా మొదటి స్థానంలో ఉంచుటకు కృషి చేయాలని అన్నారు. అనంతరం జిల్లా సైన్స్ అధికారి అప్పని జయదేవ్ మాట్లాడుతూ 284 కి పైగా ఎగ్జిబిట్లు తీసుకువచ్చి విద్యార్థులలో సైన్స్ పై మక్కువను పెంచడానికి కృషి చేస్తున్నటువంటి సైన్స్ ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించబడే వివిధ సైన్స్ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరు ఉత్సాహంగా పాల్గొనాలని విద్యార్థులకు సైన్స్ పై మక్కువను పెంచి, శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించాలని వారు అన్నారు. అదేవిధంగా ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో సహకరించినటువంటి సమస్త యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు కమిటీ కన్వీనర్లు, వేదికను సమకూర్చినటువంటి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనంకొండ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస స్వామి, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్లు అర్షం రాజు, కాటం మల్లారెడ్డి, జి రమాదేవి, గుల్లపెల్లి సాంబయ్య, సైకం శ్రీనివాసరెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు ప్రభాకర్, కేశవరావు, కొయ్యడ మల్లయ్య,జివివి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి, సోమారెడ్డి, తిరుపతి, విద్యాసాగర్, వినోద్ కుమార్, ఝాన్సీ, బాణాల సుధాకర్, వివిధ ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యులు, జిల్లాలోని సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యాభిలాషులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

**- లోక్ అదాలత్ లో కేసుల సత్వర పరిష్కారం**

**- పాలకవీడు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోండి.**

**- ఎస్ ఐ లక్ష్మీ నరసయ్య**




పాలకీడు, డిసెంబర్ 13 (తీన్మార్ న్యూస్): జాతీయ లోక్ అదాలత్ లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పాలకవీడు మండల ఎస్ఐ లక్ష్మి నరసయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా పాలకవీడు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14 తారీకు శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారని కావున మండల ప్రజలకు ఇదొక సువర్ణ అవకాశం అని కోర్టులో ఎప్పటి నుంచో పెండింగులో ఉన్న కేసులను రాజీ చేసుకొని, కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు లోక్ ఆదాలత్ పనిచేస్తుంది అని తెలిపారు. అధిక సంఖ్యలో క్రిమినల్, సివిల్ బ్యాంకులకు సంబంధించి కేసులను జాతీయ లోక్ ఆదాలత్ లో పరిష్కరించుకోవాలని, రాజీ మార్గమే రాజమార్గం అని ఎస్ ఐ లక్ష్మీ నరసయ్య సూచించారు.

# గ్రామ బాలల పరిరక్షణ కమిటీ బలోపేతం ద్వారా పిల్లల సంక్షేమం: ఏంపీఓ రహిమోద్దిన్



ములుగు: గ్రామ బాలల పరిరక్షణ కమిటీ బలోపేతం ద్వారా పిల్లల సంక్షేమం, రక్షణకు ఎంతో మేలు జరుగుతుందనీ ఏంపీఓ రహిమోద్దిన్ అన్నారు. ములుగు మండలం మల్లంపల్లి గ్రామంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏంపీఓ రహీమొద్దిన్ ముఖ్య అతిథిగా పాల్గొని, కమిటీ సభ్యులకు వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ బాలల పరిరక్షణ కమిటీ బలోపేతం ద్వారా పిల్లల సంక్షేమం, రక్షణకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. పిల్లల సమస్యలను పరిష్కరించడంలో కమిటీ ముఖ్య భూమిక పోషించాలన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారికి సమస్యలు ఎదురైనప్పుడు, వాటిని వెంటనే తెలియజేయడం ఎంత ముఖ్యమో వివరించారు. సమస్యలపై తగిన సమాచారాన్ని ఫోన్ ద్వారా అందించటం వల్ల పరిష్కార మార్గాలు వేగంగా లభించగలవని ఆయన స్పష్టం చేశారు.కమిటీ సభ్యులు గ్రామంలో పిల్లల విద్య, ఆరోగ్యం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. అలాగే, బాల్య వివాహాలు, శారీరక మరియు మానసిక వేధింపులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్థానిక గ్రామపంచాయతి స్పెషల్ ఆఫిసర్ నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి,సోషల్ వర్కర్ జ్యోతి, చైల్డ్ హెల్ప్ లైన్ విక్రమ్, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆలోచన విధానమే..జీవితాశయం

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**- ఓటమి వేనుకే..గెలుపుంటుందని హితవు**

**- క్రీడలు స్నేహిన్ని పెంపోదిస్తాయని సూచన**

**- విజేతలకు సీఎం కప్ బహుమతుల అందజేత**



బెజ్జంకి : ఏ రంగంలో స్థిరపడాలని విద్యార్థి దశలో ఆలోచన చేసే విధానమే.. జీవితాశయమవుతుందని మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.శుక్రవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల అవరణంలో నిర్వహించిన సీఎం కప్ క్రీడల బహుమతుల ప్రధానోత్సవానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.ఓటమి వేనుకే..గెలుంటుందని..క్రీడల్లో గెలుపోటములు సహజమని క్రీడాకారులకు సూచించారు. క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడమే క్రీడాకారుల లక్షణమన్నారు.క్రీడలు స్నేహాన్ని పెంపోదిస్తాయని..అందరూ స్నేహ భావాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేకంగా క్రీడల సమయాన్ని కేటాయించాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. అనంతరం సీఎం కప్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రశంస పత్రాలు,మెడల్స్, షీల్డులు అందజేశారు.ఏఎంసీ చైర్మన్ పులి క్రిష్ణ,తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీన్,వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,నాయకులు ఒగ్గు దామోదర్,ముక్కీస రత్నాకర్ రెడ్డి,ఏఎంసీ డైరెక్టర్ పులి సంతోష్,పీఆర్ ఏఈ సమ్మయ్య,పంచాయితీ కార్యదర్శి ప్రనీత్ రెడ్డి,నాయకులు అక్కరవేణి పోచయ్య,శానగొండ శరత్,సందీప్,భైర సంతోష్,జెల్లా ప్రభాకర్,రాసూరి మల్లికార్జున్,చెన్నారెడ్డి,అయా పాఠశాలల పీడీలు కనుకారెడ్డి,బోధన సిబ్బంది,విద్యార్థులు హాజరయ్యారు.

# లేబర్ కోడ్‌లు పెట్టుబడిదారుల కోసమే

**- రద్దు కోసం కార్మిక వర్గం పోరాడాలి సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్**

**- సంగారెడ్డిలో సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభల సందర్భంగా "లేబర్ కోడ్‌లు-కార్మిక వర్గ కర్తవ్యం"పై సెమినార్**




పటాన్ చెరు: కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు పెట్టుబడిదారుల కోసమేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ అన్నారు. జనవరిలో జరగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను పురస్కరించుకొని గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని ఐలాభవన్‌లో "లేబర్ కోడ్‌లు- కార్మిక వర్గ కర్తవ్యం" అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం వెనుక కార్పొరేట్లు, పెట్టుబడిదారుల లాభాలు దాగున్నాయని, వాటిని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లోబర్ కోడ్‌ల వల్ల భవిష్యత్తులో కార్మికులు తమ హక్కులను కోల్పోతారని, పరిశ్రమలను ఎప్పుడైనా మూసుకోవచ్చని, కార్మికులను ఇష్టానుసారంగా తొలగించవచ్చని, కార్మిక హక్కులపై ఎటువంటి పర్యవేక్షణ చేసే అధికారులు, సిబ్బంది ఉండరని తెలిపారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐ, సంక్షేమ పథకాలు కూడా వర్తించవని విమర్శించారు. వీటివల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రోజుకు రూ.174 ఉండాలని మోడీ ప్రతిపాదించారని, దీంతో కుటుంబ జీవనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కార్మికులకు నష్టాన్ని చేకూర్చే లేబర్ కోడ్‌లను తిప్పికొడితేనే భవిష్యత్తు అని, దానికోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతాంగ పోరాటం స్ఫూర్తితో కార్మికులూ లేబర్ కోడ్‌లపై ఉద్యమించాలని తెలిపారు. అనంతరం సీపీఐ(ఎం) మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, ఉపాధ్యక్షులు కె.రాజయ్య, సీపీఐ(ఎం) నాయకులు పాండురంగారెడ్డి మాట్లాడారు. ఈ సెమినార్‌లో సీపీఐ(ఎం) నాయకులు నాగేశ్వరరావు, శాంత కుమార్, అనంత రావు, వాజిద్ అలీ, సంతోష్ కుమార్ గౌడ్, శ్రీకాంత్, మనోహర్, మురళి, శేషగిరి, శ్రీధర్, తిరుపతి, హరినాథ్, సురేష్, రామకృష్ణ, రాఘవేంద్ర, మల్లేష్, బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

# 22న 'కాకతీ కదన భేరి'

**- పోస్టర్ ఆవిష్కరించిన సీపీఎస్ యూనియన్ : రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు స్థితప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్**

వరంగల్: తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 22న వరంగల్‌లో జరగనున్న 'కాకతీ కదన భేరి' కార్యక్రమం పోస్టర్‌ను యూనియన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు స్థితప్రజ్ఞ, కల్వల్ శ్రీకాంత్.. రంగంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. అనంతరం సంఘం సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ.. 1 ఏప్రిల్ 2025 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ డిసెంబర్ 22న ఉద్యోగ, ఉపాధ్యాయులతో వరంగల్ జిల్లా కేంద్రంగా భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు.

# భూమికి భూమి కోరుతున్న ఓరుగల్లు రైతులు

వరంగల్: వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు భూ సేకరణ ప్రక్రియ ప్రభుత్వానికి తలనొప్పిగా మారింది. ఇప్పటికే ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు అవసరమైన 253 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం రూ.205 కోట్లు విడుదల చేస్తూ నవంబర్ 17న ఉత్తర్వులు జారీ చేయగా.. రైతులు భూమి కావాలని పట్టుబడుతున్నారు.వరంగల్ విమానాశ్రయ వ్యవహారం మొదటికొచ్చింది. భూమికి భూమి పరిహారం కావాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ మార్కెట్ రేట్ ప్రకారం నామ్ కే వాస్తే అన్నట్టుగా పరిహారం ఇచ్చి భూములు లాక్కునే ప్రయత్నాల్లో ఉందని మండిపడుతున్నారు. ఈ మేరకు ఇదే విషయమై మంగళవారం వరంగల్ ఆర్డీవో ను కలిసిన కొందరు రైతులు.. భూమికి భూమి ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. లేదంటే తాము ఎయిర్ పోర్టు పునరుద్ధరణ కోసం తమ జీవనాధారమైన సాగు భూములను వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. దీంతో వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు భూ సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయింది. మామునూరు విమానాశ్రయానికి గతంలో మొత్తంగా 1,875 ఎకరాల స్థలం ఉండేది. ఈ స్థలంలో 6.6 కి.మీ రన్ వే, పైలట్, సిబ్బంది క్వార్టర్స్, పైలట్ శిక్షణ కేంద్రం, ఒకటి కన్నా ఎక్కువ టెర్మినళ్లు ఉ ండేవి. కానీ విమానాశ్రయానికి చెందిన 468 ఎకరాల భూమిలో మామునూరు టీజీఎస్పీ ఫోర్త్ బెటాలియన్, పోలీస్ ట్రైనింగ్ సెంటర్ ను ఏర్పాటు చేశారు. మరో 700 ఎకరాల్లో ప్రభుత్వ డెయిరీ ఫాం నిర్మించారు. దీంతో మిగిలిన స్థలం చుట్టూ రక్షణగా ఇటీవల ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు ప్రహరీ నిర్మించారు. ఇక మిగిలిన దాంట్లో విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయడానికి 943.14 ఎకరాల భూమి అవసరం కాగా ప్రస్తుతం 696.14 ఎకరాల భూమి మాత్రమే అందుబాటులో ఉంది. ఇక ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు అదనంగా 253 ఎకరాల భూమి కావాలని అధికారులు గతంలోనే గుర్తించారు. ఈ మేరకు గుంటూరుపల్లి, నక్కలపల్లి, గాడిపల్లి గ్రామాల శివారులో భూమిని సేకరించేందుకు అప్పట్లోనే సన్నాహాలు చేశారు. కానీ గత బీఆర్ఎస్ సర్కారు దాదాపు పదేళ్ల పాటు నాన్చుతూ రాగా.. ఆ సమస్య అలాగే ఉండిపోయింది. ఫలితంగా మామునూరు ఎయిర్ పోర్టు కాగితాలకే పరిమితం అయింది.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మామునూరు ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు ఒక అడుగు ముందుకు వేసింది. ఈ మేరకు భూసేకరణ ప్రక్రియ చేపట్టాల్సిందిగా ఆఫీసర్లకు ఆదేశాలు ఇచ్చింది. కానీ ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు కావాల్సిన భూమిలో నక్కలపల్లి, గుంటూరుపల్లి, గాడిపల్లి గ్రామాలకు చెందిన 233 మంది రైతులకు సంబంధించిన వ్యవసాయం, అసైన్డ్ భూములు, లే అవుట్ ప్లాట్లు, 13 నివాస గృహాలున్నాయి.దీంతో ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియలో భాగంగా కొద్దిరోజుల కిందట జిల్లా మంత్రి కొండా సురేఖ, ఎంపీ కడియం కావ్య, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, తదితర నేతలు, ఆఫీసర్లతో కలిసి నవంబర్ 7వ తేదీన ఆ మూడు గ్రామాల రైతులు, ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తమకు భూమికి బదులు భూమి ఇవ్వాల్సిందేనని అక్కడి రైతులు ముక్త కంఠంతో స్పష్టం చేశారు.దీంతో భూ నిర్వాసితులకు తగిన న్యాయం చేస్తామని మంత్రి కొండా సురేఖ, ఇతర నేతలు వారికి హామీ ఇచ్చారు. కానీ ఆ తర్వాత భూముకి భూమి ఇవ్వాల్సిన ప్రభుత్వం భూ సేకరణ కోసం నవంబర్ 17న 205 కోట్లు రిలీజ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో అక్కడి రైతులు గందరగోళంలో పడ్డారు.వాస్తవానికి ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు కొంతమంది రైతులు మాత్రమే భూములకు బదులు పరిహారం తీసుకునేందుకు అంగీకారం తెలిపినట్లు తెలిసింది. మెజారిటీ రైతులు మాత్రం పరిహారానికి ఒప్పుకోక, వాళ్లంతా భూమికి భూమి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు భూసేకరణను ఫండ్స్ రిలీజ్ చేసినప్పటి నుంచి ఆఫీసర్ల చుట్టూ తిరుగుతున్నారు. కాగా తమ భూములు ఎకరానికి ఐదారు కోట్లు పలుకుతున్నాయని, కానీ ప్రభుత్వ మార్కెట్ వాల్యూ నాలుగైదు లక్షలు మాత్రమే ఉందని అక్కడి రైతులు చెబుతున్నారు.ఆ రేటు ప్రకారం ప్రభుత్వం పరిహారాన్ని ఆరు రెట్లు పెంచి ఎకరానికి 24 లక్షల కంటే ఎక్కువ ఇచ్చే అవకాశం లేదని అధికారులు స్పష్టం చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐదారు కోట్లు పలికే భూమికి 24 లక్షలు ఇస్తామంటే తాము భూములు వదులుకునే ప్రసక్తే లేదని అన్నదాతలు స్పష్టం చేస్తున్నారు. గతంలో సెంట్రల్ జైల్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చారని, కనీసం ఆ భూమినైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. .భూమికి బదులు భూమి ఇవ్వకుంటే తాము సాగు చేసుకుంటున్న ల్యాండ్స్ ను వదులుకునే ప్రసక్తే లేదని తేల్చి చెబుతున్నారు. అలా కాదని బలవంతంగా భూములు తీసుకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీంతో మామునూరు ఎయిర్ పోర్టు పునరుద్ధరణకు ఇన్నాళ్లుగా సవాల్ గా మారిన భూ సమస్యే మళ్లీ తిరగబడినట్లైంది.

ఇప్పటికే ఎయిర్ పోర్టు పునరుద్ధరణను పూర్తి చేస్తామని చెప్పుకొస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మరి ఈ భూసేకరణ విషయంలో ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# కులాల పేరు మార్పుపై బీసీ కమిషన్ భేటీ

హైదరాబాద్: బీసీ కమిషన్ ఉమ్మడి పది జిల్లాల్లో మరియు బీసీ కమిషన్ కార్యాలయంలో జరిగిన బహిరంగ విచారణలో కులాల పేరు మార్పుపై విజ్ఞప్తి చేసిన కులాల ప్రతినిధులతో గురువారం కమిషన్ మార్పు కోరిన కులం ఇతర ప్రతిపాదనలు వారి నుండి అభిప్రాయాలు తీసుకుని రికార్డ్ చేయడం జరిగింది. ఇందులో భాగంగా దొమ్మర ,వంశరాజ్ మరియు తమ్మలి కుల సంఘాల ప్రతినిధులు హాజరై తమ కులాల యొక్క స్థితిగతుల గురించి వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంలో దొమ్మర కులం వారు తమ కులం పేరు ను గడ వంశీ గా మార్చవలసిందిగా విజ్ఞప్తి చేయడం జరిగింది అదేవిధంగా వంశరాజ్ కులం వారు తమ కులం పేరు లో నుండి పిచ్చిగుంట్ల అనే పదాన్ని పూర్తిగా తొలగించాలని, తమ్మలి కులం వారు తమ కులం నుండి నాన్ బ్రాహ్మిన్, సూద్రా క్యాస్ట్ పదాలను తొలగించాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ పదాలతో తాము సమాజం లో అనేక అవమానాలు మరియు అవహేళనలు ఎదుర్కొంటున్నామని ఆరే రాములు , మురళి కృష్ణ , వట పత్ర సాయి మొదలగు కుల ప్రతినిధులు వారి యొక్క ఆవేదనను కమిషన్ ముందు వ్యక్తపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో . జి నిరంజన్, చైర్మన్, మరియు సభ్యులుశ్రీ రాపోలు జయప్రకాష్ , తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ యు శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ .జి సతీష్ కుమార్, రిసెర్చ్ ఆఫీసర్ లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కాక రేపుతున్న కృష్ణయ్య ఎంట్రీ

హైదరాబాద్: తెలంగాణ కాషాయంలో కృష్ణయ్య ఎంట్రీ కాక రేపుతోంది. ఉన్నట్లుండి ఆయనకెందుకు ఎంపీ పదవి ఇచ్చినట్లు అని కొందరు రుసరుసలాడతున్నారట. ఇంకొందరికి ఆయనొస్తున్నారంటే బీసీ కోటాలో ఇంకో కాంపిటేటర్..మరో పవర్ సెంటర్ తయారవుతుందని గుబులు పట్టుకుందట.తెలంగాణ బీజేపీ లీడర్లకు ఆర్.కృష్ణయ్య గుబులు పట్టుకుందట. ఏపీ కోటాలో బీజేపీ సభ్యుడిగా రాజ్యసభకు నామినేట్ అయిన ఆర్.కృష్ణయ్య రాక..కమలం లీడర్లను కలవరపెడుతోందట. అసలే తెలంగాణకు చెందిన బీసీ నేత. ఆయనొస్తే తమకు ఎక్కడ కాంపిటేటర్ అవుతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పార్టీ బీసీ నినాదం ఎత్తుకోవడంతో..పలువురు నేతలు రాష్ట్ర అధ్యక్ష పదవి మీద..పార్టీ పవర్‌లోకి వస్తే సీఎం పదవి ఇంకొందరు లీడర్లు బోలెడు ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడున్న పోటీనే తలనొప్పిగా ఉందంటే..ఆర్.కృష్ణయ్య మరో పోటీదారుగా ఉంటారని ఇంటర్నల్‌గా చర్చ జరుగుతోందట.ఆర్.కృష్ణయ్య..బీసీ సంఘం నేతగా మంచి గుర్తింపు ఉన్న లీడర్. మొదట టీడీపీలో చేరి..ఎల్బీనగర్ నుంచి 2014లో ఎమ్మెల్యే అయ్యారు. అప్పుడు అధికారంలోకి వస్తే బీసీని సీఎం చేస్తామని ఆర్.కృష్ణయ్యను ముందు పెట్టి ఎన్నికలకు వెళ్లింది టీడీపీ. తర్వాత 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక జగన్ ఆయనను ఏపీ కోటాలో రాజ్యసభకు పంపారు. కూటమి అధికారంలోకి వచ్చాక..తన రాజ్యసభ సభ్యత్వానికి రిజైన్ చేసి.. ఇప్పుడు మళ్లీ ఏపీ కోటాలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు అయ్యారు ఆర్.కృష్ణయ్య. ఇదే ఇప్పుడు తెలంగాణ బీజేపీలో కాక రేపుతోందట.ఆర్.కృష్ణయ్యను ఏపీ నుంచి రాజ్యసభకు పంపడాన్ని అక్కడ బీజేపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. పార్టీ కోసం కష్టపడిన చాలా మంది నేతలు ఉండగా ఆర్.కృష్ణయ్యకు ఇవ్వడం ఏంటని అంతర్గతంగా అసంతృప్తిని తెలియజేసినట్టు తెలుస్తోంది. రాకరాక అవకాశం వస్తే పార్టీ నేతలకు కాకుండా కనీసం పార్టీ సభ్యత్వం లేని అతనికి ఇవ్వడం ఏంటని.. అది కూడా పొరుగు రాష్ట్రమైన తెలంగాణ వ్యక్తికి ఇవ్వడం ఏంటని ఏపీ బీజేపీ నేతలు మదనపడుతున్నట్లు తెలుస్తోంది. ఇటు తెలంగాణ కాషాయంలోనూ ఆర్.కృష్ణయ్య రాకపై ఆందోళన వ్యక్తం అవుతోందటఏపీ నుంచి ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సీటు ఇవ్వడం ఏపీలోనే కాదు తెలంగాణలోనూ రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఆర్.కృష్ణయ్య వల్ల పార్టీకి ఉపయోగం లేకపోగా గతంలో ఆయన వల్ల పార్టీ తీవ్రంగా నష్ట పోయిందని వాపోతున్నారట నేతలు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ బీసీ సీఎంను ప్రకటిస్తే కనీసం మద్దతు తెలపకపోగా కేసీఆర్‌కు మద్దతిచ్చారని చర్చించుకుంటున్నారు కమలం లీడర్లు. హుజూరాబాద్ ఎన్నికల్లో బీసీ నేత అయిన ఈటల రాజేందర్ పోటీ చేస్తే..ఆయనకు మద్దతు ఇవ్వకుండా అధికార పార్టీకి సపోర్ట్ చేశారని గుర్తు చేస్తున్నారు. అలాంటి నేతను బీజేపీ లోకి తీసుకుని రాజ్యసభ సీటు ఇచ్చే అవసరం ఏమొచ్చిందని చర్చించుకుంటున్నట్టు సమాచారం. బీజేపీ జాతీయ నాయకత్వం బీసీలకే రాజ్యసభ సీటు ఇవ్వాలనుకుంటే అందులోనూ తెలంగాణ వ్యక్తికి ఇవ్వాలనుకుంటే చాలామంది బీజేపీకి చెందిన సీనియర్ నేతలు ఉండగా ఆర్.కృష్ణయ్యను తమ మీద రుద్దడం ఎంటన్న గుసగుసలు పార్టీ ఆఫీస్‌లో వినిపిస్తున్నాయి.తెలంగాణ బీజేపీ నేతలు ఈ స్థాయిలో ఆర్.కృష్ణయ్యపై అసహనం వ్యక్తం చేసేందుకు మరో కారణం కూడా లేకపోలేదు. తెలంగాణలో బీజేపీ బీసీ నాయకత్వానికి ముందు నుంచి ప్రాధాన్యత ఇస్తూ వస్తోంది. బీసీ నేత అయిన లక్ష్మణ్ పార్లమెంటరీ బోర్డు సభ్యుడితో పాటు యూపీ నుంచి రాజ్యసభకు పంపింది బీజేపీ హైకమాండ్. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీని సీఎంను చేస్తామని కూడా ప్రకటించింది. తెలంగాణ బీజేపీలో బీసీ నేతలుగా ఈటల రాజేందర్, బండి సంజయ్‌ను ఎక్స్‌పోజ్ చేస్తూ వచ్చింది. బీజేపీ గెలిస్తే వీరిలోనే ఒకరు సీఎం అవుతారని కూడా పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఇప్పుడు తెలంగాణకే చెందిన ఆర్.కృష్ణయ్యకు ఏపీ నుంచి రాజ్యసభ సీటు ఇచ్చినా డాక్టర్ లక్ష్మణ్ లాగా తెలంగాణలోనే ఆయనను యాక్టీవ్ చేసే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది.ఇప్పుడిదే తెలంగాణ బీజేపీ నేతల్లో ఆందోళన కలిగిస్తుందట. బీసీ నేతగా ఇప్పటికే ఎస్టాబ్లిష్ అయిన ఆర్.కృష్ణయ్య బీజేపీలో యాక్టీవ్ అయితే బీజేపీలోనే బీసీ నేతల స్థానాలకు ఇబ్బంది వస్తుందని ఆందోళన చెందుతున్నట్లు టాక్. దీనికి తోడు ప్రధాని మోదీ తనతో స్వయంగా మాట్లాడారని..తెలంగాణ బీజేపీలో యాక్టీవ్‌గా ఉండాలని కోరారని ఆర్.కృష్ణయ్య సన్నిహితుల దగ్గర చెప్పుకుంటున్నట్టు సమాచారం.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే తమ నేత సీఎం అవుతారని అందుకే తెలంగాణలో యాక్టీవ్ కావాలని మోదీ సూచించారని ఆర్.కృష్ణయ్య అనుచరులు చెప్పుకోవడం చర్చనీయాంశం అవుతోంది. ఒకే ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆర్.కృష్ణయ్య.. రెండుసార్లు వరుసగా రాజ్యసభకు వెళ్లారు. ఇప్పుడు బీసీ కార్డ్‌తో తెలంగాణ బీజేపీలో కాక రేపుతున్నారు. చూడాలి మరి ఆర్.కృష్ణయ్య ఎఫెక్ట్ తెలంగాణ బీజేపీలో ఎంత వరకు ఉంటుందో.

# సీపీఐ(ఎం) బహిరంగ సభ జయప్రదం చేయండి ..



పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ..

భువనగిరి: ఆదివారం డిసెంబర్ 15 16 17 తేదీలలో చౌటుప్పల్ లో సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నారని బహిరంగ సభను జయప్రదం చేయాలని పట్టణ ప్రజలు అభిమానులు, పార్టీ సభ్యులు ప్రజా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున కదిలి రావాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ అన్నారు. శుక్రవారం భువనగిరి పట్టణంలో హౌసింగ్ బోర్డ్ లో సుమారు మూడు నెలల నుండి అండర్ పాస్ పైప్ లైన్ కోసం ఇరువైపుల రోడ్లను తవ్వి పైపులు వేసి రోడ్లు వేయడం లేదన్నారు. హౌసింగ్ బోర్డ్ కాలనీలోకి స్కూల్ బస్సులు రావాలన్నా ఆటోలు రావాలన్నా కాలనీ ప్రజలకు మూడు నెలల నుండి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పాలకులు అధికారులు కాంట్రాక్టులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఒక ఏరియా రోడ్లు పూర్తిచేసిన తర్వాత రెండవ పక్క మొదలుపెట్టి పైపులైన్లు రోడ్లు వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారని తెలిపారు. కాంటాక్ట్స్ సౌభాగ్యం కోసం ఒకేసారి పైప్ లైన్లు వేసి పూర్తి చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఇంజనీర్లు అధికారులు పాలకులు ఆలోచించి వెంటనే రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ కార్యవర్గ సభ్యులు ఎల్లయ్య కల్లూరి నాగమణి చింతల శివ, పాలడుగు రవి, సునీత, అంజలి పాల్గొన్నారు.

# కాజీపేట రైల్వే స్టేషన్ చూడతరమా...

వరంగల్: తెలుగు రాష్ట్రాల్లో పలు రైల్వే స్టేషన్ల రూపు రేఖలు మారిపోతున్నాయి.“ అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్” రైల్వే శాఖ? ప్రయాణీకులకు ఆధునిక సౌకర్యాలను అందించేందుకు అభివృద్ధి పనులు చేపట్టింది. ఇందులో భాగంగా కాజీపేట్ రైల్వే స్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.రైల్వే ప్రయాణీకులకు సరికొత్త అనుభూతితో పాటు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించాలనే లక్ష్యంతో భారీ స్థాయిలో రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను భారత రైల్వే చేపడుతోంది. ఇందుకోసం “ అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్” ను తీసుకొచ్చింది. ఈ స్కీమ్ లో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో ఉన్న కాజీపేట్ రైల్వే స్టేషన్ రూపురేఖలను మార్చేలా మాస్టర్ ప్లాన్ రూపొందించింది. మొత్తం 24.5 కోట్ల రూపాయాలతో కాజీపేట్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు జరగనున్నాయి. అయితే ఇందుకు సంబంధించిన డిజైన్ ఫోటోలను దక్షిణ మధ్య రైల్వే విడుదల చేసింది.అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ లో భాగంగా కాజీపేట్ రైల్వే జంక్షన్ స్టేషన్ ను ఆధునాతన స్టేషన్ గా మార్చబోతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. రైల్వే స్టేషన్ ముఖద్వారాల అభివృద్ధి, ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారాలను ఈ స్కీమ్ లో భాగంగా ఏర్పాటు చేయనున్నారు. స్టేషను ఆవరణలో పచ్చదనాన్ని పెంచడం, ల్యాండ్ స్కేపింగ్ వంటి వాటిని అభివృద్ధి చేస్తారు. పార్కింగ్ కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నారు.మరోవైపు యాదాద్రి రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయబోతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది.దీనికి సంబంధించిన ప్రతిపాదిత డిజైన్‌లపై విడుదల చేసింది. ఆలయం రూపం వచ్చేలా యాదాద్రి స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. రూ.24.5 కోట్లతో పనులు చేపట్టనున్నారు.రైల్వే స్టేషన్ల అప్ గ్రేడేషన్ ప్రక్రియలో భాగంగా.. తెలంగాణలో మొత్తం 39 స్టేషన్లను రైల్వేశాఖ గుర్తించింది. వీటిని పూర్తిగా ఆధునీకరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదటి విడతలో తెలంగాణ నుంచి 21 స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా? స్టేషన్లను ఆధునీకరించడంతో పాటు స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడం, స్టేషన్లో స్వచ్ఛత ఉ ండేలా చూడటం, ప్రయాణికుల వెయిటింగ్ హాల్స్ , టాయిలెట్స్, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఉచిత వై-ఫై సదుపాయాన్ని కల్పిస్తారుఅభివృద్ధి చేసే రైల్వే స్టేషన్లలో స్థానిక ఉత్పత్తులకు సరైన గుర్తింపు కల్పించేందుకు ‘వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్’ షాపులను కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులకు అవసరమైన సమాచారం అందించే వ్యవస్థలు, ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లు, స్టేషన్ ముందు, వెనక భాగాల్లో మొక్కల పెంపకం, చిన్న గార్డెన్లు వంటివి ఏర్పాటు చేస్తారు.

# బతుకమ్మ లో ఫ్యూడల్ ఇజం ముడిపడి ఉంది

**– గిరిజన, మాదిగ,ముస్లిం, క్రిస్టియన్, బౌద్ధులు ఎప్పుడు బతుకమ్మ ఆడలేదు**

**– పింక్ కలర్ నిజాం పాలన కి సింబల్**

**– పదేళ్ళు పాలించిన వాళ్ళు కోడి గుడ్డు మీద ఈకలు పీకుతున్నారు**

**– కేటీఆర్ కి ఆలిని మార్చే సంస్కృతి కావచ్చు తెలంగాణది కాదు**

**– బిఆర్ఎస్ పై నిప్పులు చెరిగిన కాంగ్రెస్ నేతలు**

హైదరాబాద్: బతుకమ్మ లో ఫ్యూడల్ ఇజం ముడిపడి ఉందని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, చరణ్ కౌశిక్, లింగం యాదవ్, శ్రీనివాస్ లు బిఆర్ఎస్ పార్టీ, ఆపార్టీ నేతలపై తీవ్ర స్థాయి లో ధ్వజమెత్తారు. గాంధీ భవన్..లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ గిరిజన,మాదిగ,ముస్లిం,క్రిస్టియన్,బౌద్ధులు ఎప్పుడు బతుకమ్మ ఆడలేదు, ,పదేళ్ళు పాలించిన వాళ్ళు కోడి గుడ్డు మీద ఈకలు పీకుతున్నారుట్రైకార్ ఛైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. తెలంగాణ తల్లి,రాష్ట్రీయ గీతం అధికారికంగా ప్రజయించుకున్నాం.పదేళ్ళు పాలించిన వాళ్ళు కోడి గుడ్డు మీద ఈకలు పీకుతున్నారు.మా ఇంట్లో ఎప్పుడూ బతుకమ్మ ఆడలేదు..గిరిజన,మాదిగ,ముస్లిం,క్రిస్టియన్,బౌద్ధులు ఎప్పుడు బతుకమ్మ ఆడలేదు.కొన్ని ఫ్యూడల్ కులాలు బతుకమ్మ అడాయి.. మేము గౌరవించాం.తెలంగాణ లో ప్రధానంగా బోనాలు చేస్తారు..బతుకమ్మ లో ఫ్యూడల్ ఇజం ముడిపడి ఉంది.ఆ చరిత్ర చెప్పే టైమ్ లో తప్పక చెబుతా..నన్నారు.పింక్ కలర్ నిజాం పాలన కి సింబల్ టిపిసిసి ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు.బతుకమ్మ తెలంగాణ సంప్రదాయంలో ఉంది.. కానీ బతుకమ్మ మెజారిటీ ప్రజలు ఆడరు.కేసిఆర్ భార్య శోభమ్మ,కూతురు కవితమ్మ ఎప్పుడు కిరీటాలు పెట్టుకోలేదు.పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు అధికారికంగా పెట్టలేక పోయారని ప్రశ్నించారు..బిఆర్ఎస్ అని పార్టీ పేరు మార్చుకున్న మీరు తెలంగాణ తల్లి కి ద్రోహం చేసిందన్నరు..కేసిఆర్ ఉనికి రాష్ట్రంలో లేనే లేదు.కేసిఆర్ అసెంబ్లీ కి రాకపోతే పదవి ఎందుకు పీకనికా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దళితుల,గిరిజనుల,చాలా బీసీ ఇండ్లలో బతుకమ్మ ఆడలేదు.కేసిఆర్ కుటుంబం మునిగే పడవను ఆపడానికి ఏదైనా చేస్తారు.సోషల్ మీడియా మీద ఆధారపడితే మీ పతనం ఖాయం.కేటీఆర్ కి ఆలిని మార్చే సంస్కృతి కావచ్చు తెలంగాణది కాదు.

# వయోధికులకు మరిన్ని సేవలు

**– దివ్యాంగులు ,వయో వృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకురాలు శైలజ.**

జగిత్యాల: రాష్ట్రంలో గడచిన పదేళ్లలో వయోధికుల సంఖ్య అరకోటికి చేరుకుందని రాష్ట్ర దివ్యఅంగుల,వయోధికుల సంక్షేమ శాఖ సంచాలకురాలు బి శైలజ అన్నారు.తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ తొమ్మిదో ఆవిర్భావ దినోత్సవం,2025 డైరీ ఆవిష్కరణ వేడుకలు హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో జరిగాయి.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన శైలజ మాట్లాడుతూ కేరళ కు వెళ్లి అక్కడ ఆమలవుతున్న హెల్ప్ లైన్ సేవలను అధ్యయనం చేసి ,రాష్ట్రం లోను ఏర్పాటుకు ప్రయత్నిస్తామన్నారు.

అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహారావు మాట్లాడుతూ వయోధికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.పురుష వయోధికులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ వసతి సౌకర్యం,ప్రత్యేక వయోధికుల సంక్షేమ శాఖ ఏర్పాటు,వయోధికులకు ప్రభుత్వ ,ఎయిడెడ్ ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు,వయోధికులకు ప్రత్యేక హెల్ప్ లైన్ నిర్వహన,అన్ని నగరాల్లో,పట్టణాల్లో, గ్రామాల్లో,వయోధికుల డే కేర్ సెంటర్ల ఏర్పాటు,హైదరాబాద్,జిల్లా కేంద్రాల్లో సీనియర్ సిటిజెన్ల భవనాల నిర్మాణంకు స్థలాలు,నిర్మాణాలకు నిధులు కేటాయించాలని ప్రభుత్వంను కోరారు. హైకోర్టుమాజీ న్యాయమూర్తి చంద్ర కుమార్ మాట్లాడుతూ ప్రతి గురువారం వయోధికులకు ఉచిత న్యాయ సలహా సేవలు అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్ రెడ్డి, ఓ.యూ.విశ్రాంత ఆచార్యులు మానస చెన్నప్ప,అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు పి.హన్మంత రెడ్డి, ఎం.డి.యాకూబ్, కోశాధికారి వెల్మల ప్రకాష్ రావు, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందం, కార్యదర్శి రాజ్ మోహన్, రాజయ్య, చిలుక గంగారాం,అల్లూరి బాపు రెడ్డి,33 జిల్లాల, డివిజన్ల, మండలాల అధ్యక్ష,కార్యదర్శులు, పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వే లో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలి

**– జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**

**– ఇందిరమ్మ ఇళ్ల సర్వే ను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

కోరుట్ల: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే లో ఎలాంటి అవాంతరాలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను నియోజకవర్గంలోని ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో, ఎర్దడి గ్రామం తోపాటు మెట్ పెల్లి మండల వెంపేట్, గ్రామంలో పలు వార్డు లో ఇళ్లులేని నిరుపేదలు సమర్పిం చిన దరఖాస్తుల ఆధారంగా సర్వే సిబ్బంది చేస్తున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు. యాప్ ద్వారా సర్వే చేపట్టాలని సూచిం చారు. ఇందిరమ్మ పథకం కింద పూర్తిస్థాయి అర్హత గల నిరుపేద కుటుం బాలకు ఇళ్లను అందజేసే లక్ష్యంతో సర్వే చేయాలని తెలిపా రు. జిల్లాలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజ పాలన దరఖాస్తు ఆధారంగా నిరుపేదను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల ను మంజూరు చేస్తావని తెలిపారు. ఎర్దాడి గ్రామంలో సర్వే చేసిన సరళిని పరిశీలిం చారు. అనంతరం లబ్ధిదారులు యొక్క వివరాలను యాప్ ద్వారా పొందు పరుస్తున్న వివరాల నమోదు ల్యాండ్ డాక్యుమెండను ప్లాటును స్వయంగా పరిశీలించి.కలెక్టరు దగ్గర ఉండి వివరాలను నమోదు చేయించారు.కలెక్టర్ వెంట, హౌసింగ్ ఈఈ, రాజేశ్వర్, తహసిల్దార్, ఎంపీడీవో, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో సంతోష్ ట్రోఫీ

**- 14 నుంచి ఫుట్‌బాల్ పోటీలు షురూ**

**- పోస్టర్ ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి**

న్యూఢిల్లీ : భారత్‌లో ఫుట్‌బాల్ కేంద్రంగా మారుతున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఇంటర్‌కాంటినెంటల్ కప్, ఫిఫా ఫ్రెండ్లీ మ్యాచ్ అనంతరం దేశవాళీ సంతోష్ ట్రోఫీ ఇక్కడ జరుగనుంది. 37 జట్లు పోటీపడుతున్న సంతోష్ ట్రోఫీలో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి సీనియర్ మెన్స్ జట్లు పాల్గొంటున్నాయి. హైదరాబాద్‌లోని డెక్కన్ ఎరీనాలో లీగ్ దశ మ్యాచులు జరుగనుండగా.. సెమీఫైనల్, ఫైనల్స్ గచ్చిబౌలిలో నిర్వహించనున్నారు. 57 ఏండ్ల సుదీర్ఘ విరామం తర్వాత హైదరాబాద్‌లో సంతోష్ ట్రోఫీ జరుగనుండటం సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం న్యూఢిల్లీలోని తన నివాసంలో జరిగిన ఓ కార్యక్రమంలో క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ కే.



శివసేనా రెడ్డితో కలిసి సంతోష్ ట్రోఫీ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. పార్లమెంట్ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, జీ వంశీ రామ సహాయం రఘురామి రెడ్డి సహా క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అభిషేక్‌కు 20.50 లక్షలు

**జనవరిలో ఐఎస్‌పీఎల్ సీజన్ 2**

ముంబయి : ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్(ఐఎస్‌పీఎల్) రెండో సీజన్ 2025 జనవరి 26 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు జరుగనుంది. ఇందుకోసం లీగ్ ఆటగాళ్ల వేలం గురువారం ముంబయిలో నిర్వహించగా లుధియానాకు చెందిన అభిషేక్ కుమార్ దాల్వోర్ రికార్డు స్థాయిలో రూ. 20.50లక్షలు దక్కించుకున్నాడు.

ముంబయి జట్టు అభిషేక్‌ను సొంతం చేసుకుంది. దేశంలోని 55 నగరాల నుంచి దాదాపు 30లక్షలకు పైగా ప్లేయర్లు దరఖాస్తు చేసుకోగా 350 మందికి వేలంలో అవవకాశం లభించింది. 96 మంది ప్లేయర్లను వేలంలో ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి. ఐఎస్‌పీఎల్‌లో హైదరాబాద్ ఫాల్కన్ రైజర్స్‌తో పాటు కోల్‌కత, ముంబయి, శ్రీనగర్, బెంగళూర్,



చెన్నై జట్లు పోటీపడుతున్నాయి.

# మెరిసిన గాయత్రి, ట్రెసా

**- గ్రూప్ దశలో ఓ మెరుపు విజయం**

**- బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ టూర్ ఫైనల్స్**

హాంగ్జౌ (చైనా) : ప్రతిష్టాత్మక బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్‌లో భారత డబుల్స్ స్టార్ పుల్లెల గాయత్రి గోపీచంద్, ట్రెసా జాలి జోడీ మెరుపు విజయం సాధించింది. ఏడాది ఆఖర్లో జరిగే ఈ టోర్నమెంట్‌లో అత్యుత్తమ టాప్-8 ప్లేయర్లు మాత్రమే టైటిల్ వేటలో పోటీపడతారు. మహిళల డబుల్స్ గ్రూప్-ఏలో పారిస్ ఒలింపిక్స్ సెమీఫైనలిస్టులు, మలేషియా జంట పీయర్లీ టాన్, మురళీధరన్ తినాలపై గాయత్రి, ట్రెసా జోడీ వరుస గేముల్లో గెలుపొందింది. 21-19, 21-19తో 46 నిమిషాల్లోనే మెరుపు విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. తొలి గేమ్ ఆరంభంలో 6-2తో దూకుడు చూపించిన గాయత్రి, ట్రెసా జంట 11-10తో విరామ సమయానికి ఆధిక్యం నిలుపుకుంది. మలేషియా జోడీ పుంజుకుని 15-15 వద్ద స్కోరు సమం చేసి ఉత్కంఠ రేపింది. కానీ వరుసగా పాయింట్లు సాధించిన మనోళ్లు 21-19తో తొలి గేమ్‌ను ఖాతాలో వేసుకున్నారు.

కీలక రెండో గేమ్ నువ్వా నేనా అన్నట్టు సాగింది. 5-8తో వెనుకంజ వేసిన గాయత్రి, ట్రెసాలు విరామ సమయానికి 10-11తో నిలిచింది. ద్వితీయార్ధంలోనూ మలేషియా అమ్మాయిలు మెరుపు వేగంతో



పాయింట్లు సాధించారు. 14-14 వద్ద స్కోరు సమం చేసిన మన అమ్మాయిలు 19-19 వరకు వెంబడించారు.

అక్కడ వరుసగా రెండు పాయింట్లు సాధించి 21-19తో రెండో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నారు. గ్రూప్-ఏలో తొలి మ్యాచ్‌లో భారత జంట చైనా అమ్మాయిల చేతిలో 22-20, 20-22, 14-21తో మూడు గేముల్లో పోరాడి ఓడింది. నేడు గ్రూప్ దశలో చివరి మ్యాచ్‌లో జపాన్ షట్లర్లు నమి, చిహరులతో గాయత్రి, ట్రెసాలు పోటీపడనున్నారు. గ్రూప్-ఏలో టాప్-2లో నిలిచిన షట్లర్లు నాకౌట్ దశకు అర్హత సాధిస్తారు.

# పాక్‌కు షాక్ మీద షాక్.. మొన్న గ్యారీ కిరిస్టెన్.. ఇప్పుడు జాసన్ గిలెస్పీ

పాకిస్థాన్ క్రికెట్‌లో మరోసారి కోచ్‌ల వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవలే కోచింగ్ బాధ్యతల నుంచి గ్యారీ కిరిస్టెన్ వైదొలిగిన సంగతి తెలిసిందే.

తాజాగా జాసన్ గిలెస్పీ కూడా గుడ్‌బై చెప్పేశాడు. అతడి పదవీకాలం 2026 వరకు ఉంది. కానీ, ఈలోగానే వైదొలగడం గమనార్హం. కిరిస్టెన్ వెళ్లిపోయిన తర్వాత ప్రధాన కోచ్‌గా గిలెస్పీనే పాక్ క్రికెట్ బోర్డు నియమించింది. కానీ, దక్షిణాఫ్రికాతో డిసెంబర్ 26 నుంచి టెస్టు సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో గిలెస్పీ స్థానంలో ఆకిబ్ జావెద్‌కు తాత్కాలికంగా కోచింగ్ బాధ్యతలు అప్పగించింది. కోచింగ్ బృందం నుంచి టిమ్ నీల్సన్‌ను తప్పించడంపై గిలెస్పీ అసహనం వ్యక్తం చేశాడని.. పాక్ బోర్డు తీరుతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జట్టు ఎంపికలో గిలెస్పీ కలుగజేసుకోవడం వల్లే పీసీబీ అతన్ని తప్పించిందనే వాదనా ఉంది.

గ్యారీ కిరిస్టెన్ విషయంలోనూ..

పరిమిత ఓవర్ల క్రికెట్ కోచ్‌గా గ్యారీ కిరిస్టెన్ రెండేళ్ల కాంట్రాక్ట్‌పై వచ్చాడు. కానీ, 2024 టీ20 ప్రపంచకప్‌లో పాక్ ప్రదర్శన దారుణంగా ఉండటంతో కిరిస్టెన్‌పై పీసీబీ అసంతృప్తి వ్యక్తంచేసింది. బోర్డులోని పలువురితో విభేదాల కారణంగా కిరిస్టెన్ తన పదవికి రాజీనామా చేశాడు. ఆ తర్వాత గిలెస్పీకి పరిమిత ఓవర్ల క్రికెట్ కోచింగ్ బాధ్యతలను అప్పగించింది. అప్పుడే, ఆకిబ్ జావెద్‌ను తీసుకురావాలని బోర్డులోని కొందరు ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇప్పుడు గిలెస్పీ స్థానంలో ఆకిబ్‌కే బాధ్యతలు అప్పగించడం గమనార్హం. జట్టు ఎంపికకు సంబంధించి పూర్తి అధికారాలను ఆకిబ్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది.



బాబర్ కేసు విచారణ వాయిదా

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ బాబర్ అజామ్‌పై లైంగిక ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అతడిపై కేసు కూడా నమోదైంది. అయితే, ఈ విచారణను లాహోర్ హైకోర్టు వాయిదా వేసింది. డిసెంబర్ 16 వరకు ఎలాంటి విచారణ చేపట్టమని పేర్కొంది. బాబర్‌తో రిలేషన్‌లో ఉన్నానని.. వివాహం చేసుకుంటానని ప్రామిస్ చేసి తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఓ మహిళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో బాబర్ అజామ్ సీనియర్ లాయర్ కోర్టుకు హాజరుకాలేదు. జూనియర్ లాయర్ విజ్ఞప్తి మేరకు హైకోర్టు వాయిదా వేసింది. ప్రస్తుతం బాబర్ అజామ్ టీ20 సిరీస్ కోసం దక్షిణాఫ్రికాలో ఉన్నాడు.

# తెలుగు టైటాన్స్‌కు నిరాశ

**- 27-33తో దబంగ్ ఢిల్లీ చేతిలో ఓటమి**

**- ప్రొ కబడ్డీ లీగ్ సీజన్ 11**

పుణె : ప్రొ కబడ్డీ లీగ్‌లో తెలుగు టైటాన్స్ తొమ్మిదో పరాజయం చవిచూసింది. ప్లే ఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగుతున్న తరుణంలో తెలుగు టైటాన్స్ వరుస పరాజయాలతో నిరాశపరిచింది. గురువారం పుణెలోని బాలెవాడి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన పీకెఎల్ లీగ్ దశ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్‌పై 33-27తో దబంగ్ ఢిల్లీ మెరుపు విజయం సాధించింది. ప్రథమార్థంలో 17-13తో నాలుగు పాయింట్ల ముందంజలో నిలిచిన తెలుగు టైటాన్స్ ద్వితీయార్థంలో తేలిపోయింది. స్టార్ రెయిడర్ పవన్ సెహ్రావత్ గాయం నుంచి కోలుకుని రీ ఎంట్రీ ఇచ్చినా తెలుగు టైటాన్స్‌కు ఓటమి తప్పలేదు.

# ఇప్పుడు కష్టమే.. ఇక ఆ రెండు టోర్నీలపైనే షమీ దృష్టి!

ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య మూడో టెస్టు శనివారం నుంచి ప్రారంభం కానుంది. టీమ్‌ఇండియా స్టార్ పేసర్ షమీ ఇప్పటికే ఆసీస్‌కు చేరాల్సి ఉంది.

కానీ, అతడి మోకాలిలో వాపు కనిపించినట్లు మేనేజ్‌మెంట్ తెలిపింది. దేశవాళీ క్రికెట్‌లో ఆడుతున్నప్పటికీ.. పూర్తి స్థాయి ఫిట్‌నెస్ మాత్రం సాధించలేదని సమాచారం. కనీసం చివరి రెండు టెస్టుల్లోనైనా జట్టుతోపాటు చేరతాడని భావించిన అభిమానులకు తాజా పరిణామాలు నిరాశనే మిగిల్చాయి. షమీ కూడా ఆస్ట్రేలియా ఫ్లైట్ ఎక్కడంపై ఆశలు వదులుకున్నాడని.. వచ్చే ఏడాది జరగబోయే ఛాంపియన్స్ ట్రోఫీతోపాటు ఐపీఎల్ లక్ష్యంగా సన్నద్ధమవుతున్నట్లు బీసీసీఐ వర్గాలు తెలిపాయి. గాయం కారణంగా గత ఐపీఎల్ సీజన్‌కూ షమీ దూరమైన సంగతి తెలిసిందే. ఇటీవల ముగిసిన ఐపీఎల్ మెగా వేలంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ. 10 కోట్లు వెచ్చించి షమీని తీసుకుంది. "షమీ మోకాలి గాయం కారణంగా వాపు వస్తూ పోతోంది. మరోవైపు అతడు దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని ఆసక్తితో ఉన్నాడు. ఆస్ట్రేలియాకు వెళ్లడం దాదాపు కష్టమే. డిసెంబర్ 21 నుంచి మొదలయ్యే విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ తరఫున బరిలోకి దిగాలని భావిస్తున్నాడు. తన ఫామ్‌ను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఒక్కో మ్యాచ్‌లో కనీసం 10 ఓవర్ల చొప్పున వేయాలి. ఇప్పుడు షమీ కెరీర్ కూడా చివరి దశలో ఉంది. ఆస్ట్రేలియాకు వెళ్లినా సుదీర్ఘమైన స్పెల్‌లు వేయడం కష్టమే. అతడి మోకాలు అందుకు సహకరిస్తుందో లేదో చెప్పలేం. ఆసీస్ మైదానాలన్నీ చాలా గట్టిగా ఉంటాయి. గత ఐపీఎల్ సీజన్‌ను కూడా



మోకాలి సర్జరీతో మిస్ అయ్యాడు. మెగా వేలంలో రూ. 10 కోట్లు పెట్టి ఎస్‌ఆర్‌హెచ్ తీసుకుంది. దీంతో సుదీర్ఘ ఫార్మాట్‌కు బదులు పరిమిత ఓవర్ల క్రికెట్ ఆడాలని నిర్ణయించుకున్నా అతడిని తప్పుబట్టేందుకు అవకాశం లేదు" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో షమీ 9 మ్యాచులు ఆడాడు. మొత్తం 11 వికెట్లు తీశాడు. ఎకానమీ (7.85) కూడా బాగానే ఉంది. బ్యాటింగ్‌లోనూ ఓ మ్యాచ్‌లో 17 బంతుల్లోనే 32 పరుగులు రాబట్టాడు. బెంగాల్ క్వార్టర్స్‌కు చేరుకోవడంలో కీలక పాత్రే పోషించాడు. అయితే, మోకాలిలో వాపు వచ్చినట్లు కథనాలు వస్తున్నా.. షమీ మాత్రం నాలుగు ఓవర్ల కోటా వేయడంలో పెద్దగా ఇబ్బంది పడిన దాఖలాలు లేవు.

# మాకు ఇది 3 టెస్టుల సిరీస్: శుభ్‌మన్ గిల్

బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియాతో భారత్ బ్రిస్బేన్ వేదికగా మూడో టెస్టుకు సిద్ధమవుతోంది.

ఇరు జట్లూ చెరొక విజయంతో సమంగా నిలిచాయి. తొలి మ్యాచ్‌లో 295 పరుగుల తేడాతో భారత్ గెలవగా.. రెండో టెస్టులో (గులాబీ బంతి) 10 వికెట్ల తేడాతో ఆసీస్ విజయం సాధించింది. గబ్బా టెస్టు నేపథ్యంలో శుభ్‌మన్ గిల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడాడు. తాము తాజాగా సిరీస్‌ను ప్రారంభిస్తామని.. ఇక నుంచి మూడు టెస్టుల సిరీస్‌గా భావించి ఆడతామన్నాడు. అలాగే ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు అభినందనలు తెలిపాడు.

'భారత శిబిరంలో అంతా బాగుంది. జట్టంతా కూర్చుని డిన్నర్ చేశాం. ఎంతో సరదాగా గడిపాం. అడిలైడ్‌లో మేం అనుకున్నట్లు ఫలితం రాలేదు. అందుకు మరీ ఆందోళన పడటం లేదు. ఇక నుంచి మేం మూడు టెస్టుల సిరీస్‌గా భావించి ఆడతాం. ఈ మ్యాచ్‌లో మేం గెలిస్తే.. మెల్‌బోర్న్, సిడ్నీలోనూ పైచేయి సాధిస్తాం. గత సిరీస్‌లోనూ అడిలైడ్‌లో మాకు ఓటమి ఎదురైంది. కానీ, ఆ తర్వాత మ్యాచుల్లో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకున్నాం. ఇప్పుడూ అదే పాజిటివ్ దృక్పథంతో బరిలోకి దిగుతున్నాం. గబ్బాలో మేం మెరుగైన ఆటతీరు ప్రదర్శించిన చరిత్ర ఉంది. మైదానమంతా కలియతిరిగాం. గొప్ప జ్ఞాపకాలు ఉన్నాయి. ఇక్కడ పిచ్ కూడా బాగుటుంది" అని



గిల్ వెల్లడించాడు.

కంగ్రాట్స్ గుకేశ్

"ప్రపంచ చెస్ ఛాంపియన్‌గా నిలిచిన గుకేశ్‌కు కంగ్రాట్స్. భారత జట్టు నుంచి అతడికి అభినందనలు చెబుతున్నాం. పిన్న వయసులోనే అరుదైన ఫీట్‌ను సాధించడం దేశానికే గర్వకారణం" అని గిల్ ప్రశంసించాడు. ఐసీసీ అధ్యక్షుడు జై షా స్పందిస్తూ.. "కంగ్రాట్స్ గుకేశ్. దేశం గర్వపడేలా చేశావు. భవిష్యత్తులోనూ మరిన్ని ఘనతలు సాధించాలని ఆకాంక్షిస్తున్నా" అని పోస్టు పెట్టారు.

# మేనేజ్‌మెంట్ ప్రణాళికల్లో షమీ లేనట్లున్నాడు : భారత మాజీ క్రికెటర్

భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లడంపై ఇంకా సందిగ్ధం నెలకొంది. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆడినప్పటికీ అతడి గాయం మళ్లీ తిరగబెట్టిందనే వ్యాఖ్యలు వినిపించాయి.

అందుకుతగ్గట్టుగానే కెప్టెన్ రోహిత్ చేసిన కామెంట్లూ బలం చేకూర్చాయి. 'షమీ కోసం తలుపులు తెరిచే ఉన్నాయి. కానీ, అతడిని పూర్తిస్థాయి ఫిట్‌నెస్ లేకుండా బలవంతంగా తీసుకురాలేం' అని రోహిత్ వ్యాఖ్యానించాడు. ఈక్రమంలో భారత మాజీ క్రికెటర్, విశ్లేషకుడు ఆకాశ్ చోప్రా తన యూట్యూబ్ ఛానల్‌లో ఓ వీడియోను షేర్ చేశాడు. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ కోసం మేనేజ్‌మెంట్ దృష్టిలో షమీ లేనట్లు ఉన్నాడని వ్యాఖ్యానించాడు.

"మహ్మద్ షమీ పునరాగమనంలో చాలా క్రికెట్ ఆడాడు. దాదాపు ఏడాది తర్వాత మళ్లీ మైదానంలోకి దిగాడు. దీంతో అతడి ఫిట్‌నెస్‌పై అనుమానాలు రావడం మొదలుపెట్టాయి. తొలుత ఎలాంటి ఇబ్బందిలేకుండా ఆడాడు. అంతా ఓకే అన్నట్లుగా ఉంది. కానీ, రోహిత్ శర్మ మాత్రం విభిన్నంగా స్పందించాడు. అతడిని తీసుకొనేందుకు సిద్ధమంటూనే.. తొందర పెట్టలేమని చెప్పాడు. ఇప్పుడిదే హాట్ టాపిక్‌గా మారింది. ఇలాంటి స్పందనతో షమీ ఆడతాడా? లేదా? అనేది అభిమానుల్లో అనుమానం నెలకొంది. అతడు ఆసీస్‌కు వెళ్లడం లేదనే తేలిపోయింది. షమీని పంపేందుకు ఇష్టపడటం లేదంటే.. మేనేజ్‌మెంట్ ప్రణాళికలో అతడు లేనట్లుంది. ఇదికాస్త బాధాకరమైనప్పటికీ.. ఇదే అసలు స్టోరీ. షమీ ఇంకా సిద్ధంగా లేదని మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లుంది. కెప్టెన్, కోచ్, సెలక్టర్లు ఇలానే ఆలోచిస్తున్నారేమో. షమీ మోకాలిలో వాపు వచ్చినట్లు రోహిత్ రెండుసార్లు చెప్పాడు. ప్రాక్టీస్ సెషన్‌కు ముందు ఒకసారి.. షమీ



మ్యాచ్ ఆడిన తర్వాత మరోసారి వెల్లడించాడు. బోర్డు అంతరంగిక వ్యవహారాలను బయటకు చెప్పడం సరికాదు. అందుకే, ఇలాంటివాటిపై ఎక్కువగా స్పందించను. ఈ పరిణామాలను చూస్తుంటే ఆసీస్‌కు షమీ వెళ్లడం కష్టమే" అని చోప్రా వెల్లడించాడు.

మళ్లీ జట్టులోకి జోష్ హేజిల్‌వుడ్

గులాబీ టెస్టు నుంచి దూరమైన జోష్ హేజిల్‌వుడ్‌ను మూడో టెస్టు కోసం ఆసీస్ ఎంపిక చేసింది. గబ్బా వేదికగా శనివారం నుంచి ప్రారంభం కానున్న మూడో మ్యాచ్ కోసం తుది జట్టును ఆసీస్ మేనేజ్‌మెంట్ సోషల్ మీడియాలో పోస్టు చేసింది. స్కాట్ బోలాండ్‌ను తప్పించి హేజిల్‌వుడ్‌కు అవకాశం కల్పించింది. పక్కటెముకల నొప్పి కారణంగా అడిలైడ్‌లో జోష్ ఆడలేదు. "జోష్ హేజిల్‌వుడ్ జట్టులోకి వచ్చాడు. గాయం కారణంగా రెండో మ్యాచ్‌కు దూరమైన అతడు ఇప్పుడు పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉన్నాడు. వైద్యబృందం కూడా నిరంతరం పర్యవేక్షించింది" అని ఆసీస్ కెప్టెన్ కమిన్స్ తెలిపాడు.

# ధోనీ తర్వాత ఇండియాకు కప్ అందించిన ఘనత అతనికే..

ఈ ఏడాదిని క్రికెట్ ప్రేమికులు అస్సలు మర్చిపోలేరు. ఎన్నో సంవత్సరాల తర్వాత మళ్లీ వరల్డ్ కప్పుతో మనవాళ్లు విజయకేతనం ఎగరవేశారు. మన దేశానికి అటు వన్డే వరల్డ్ కప్ ని ఇటు టీ20 ప్రపంచ కప్ ని కెప్టెన్ గా ధోని అందజేశాడు.

ధోని తర్వాత వచ్చిన క్రికెట్ టీం కెప్టెన్లు వన్డే వరల్డ్ కప్ ని గానీ టీ20 వరల్డ్ కప్ ని గానీ అందించలేకపోయారు. ఒక్క రోహిత్ తప్ప. రోహిత్ శర్మ.. అందరూ హిట్ మాన్ గా ముద్దుగా పిలుచుకునే రోహిత్ శర్మ.. ఈ ఏడాది భారతదేశానికి టీ20 వరల్డ్ కప్ ని అందజేశాడు. అఫ్ కోర్స్.. అతడు కెప్టెన్ గా ఉన్నాడు. టీంలో ఇంకా చాలామంది ఉన్నారు. అయినా కూడా.. రెండు వరల్డ్ కప్ లు అందించిన ఘనత ధోనీకి దక్కినట్టే ఈ ఏడాది టీ20 వరల్డ్ కప్ ని అందించిన ఘనత రోహిత్ కి దక్కుతుంది.



వెస్టిండీస్ లోని బార్బడోస్ లో దక్షిణాఫ్రికా తో జరిగిన ఫైనల్ మ్యాచ్?లో భారత జట్టు విజయకేతనాన్ని ఎగరవేసి ఇండియాకు రెండవ టీ20 వరల్డ్ కప్ ని అందించింది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**